జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 110 | హైదరాబాద్, జులై 04 మంగళవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# హైదరాబాద్‌కు అఖిలేశ్..

## కేసీఆర్‌తో భేటీ వెనుక వ్యూహమేంటి...?



హైదరాబాద్ : అసలేం జరుగుతోంది ? సడన్‌గా అఖిలేశ్ యాదవ్ హైదరాబాద్ సిటీకి రావడం, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అవడంతో మొదలైన ప్రశ్న ఇది. మొన్నటికి మొన్న బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన విపక్షాల భేటీ తర్వాత కేసీఆర్ పార్టీని ఆ కూటమిలోకి రానీయం అన్నారంతా. అందుకు కారణం కాంగ్రెస్ పార్టీనేనని ఈజీగా చెప్పవచ్చు. ఆ తర్వాత తెలంగాణకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత రాష్ట్ర సమితిని బీజేపీ బీ టీమ్ అన్నారు. తెలంగాణలో బీజేపీ బీ టీమ్‌ని ఓడిస్తామని కూడా కుండబద్దలు కొట్టారు. కానీ రాహుల్ వచ్చి వెళ్ళిన మర్నాడే విపక్ష కూటమిలో యాక్టివ్‌గా వున్న సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, యుపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ అనూహ్యంగా హైదరాబాద్‌లో ల్యాండయ్యారు. వచ్చీ ర్షాగానే ప్రగతి భవన్‌కు వెళ్ళి కేసీఆర్‌తో లంచ్ భేటీ అయ్యారు. కేసీఆర్‌తో భేటీ కంటే ముందే ఆయన ఓ హింటిచ్చారు. తమ లాగానే కేసీఆర్ బీజ్జేపీ మీద పోరాడుతున్నారని, ఆయనతో కలిసి మోదీని గద్దె దింపుతామని ఆయన అన్నారు. మరి పాట్నా భేటీ తర్వాత మీడియా మీట్‌లో అందరితోపాటు అఖిలేశ్ కూడా వున్నారు. బీఆర్ఎస్, వైసీపీలను పాట్నా భేటీకి ఎందుకు ఆహ్వానించలేదని అడిగితే ఆ రెండు పార్టీలను విశ్వసించలేమన్నారు. కాంగ్రెస్ స్టాండ్‌తోపాటే 17 పార్టీలు అన్న సంకేతమిచ్చారు. కాంగ్రెస్ నేతలైతే ప్రస్తుతానికి అదే స్టాండ్ మీదున్నారు. అందుక్కారణం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలేనన్నది ఏ మాత్రం రాజకీయ పర్జ్ఞినం వున్నవారిని అడిగినా చెబుతారు. మరి అఖిలేశ్, కేసీఆర్ భేటీ దేనికి ? (మిగతా 6లో..)

## 'రాహుల్ తప్పు మాట్లాడితే ఏ శిక్షకైనా సిద్ధం'..

### బీఆర్ఎస్ మంత్రులకు రేవంత్ రెడ్డి సవాల్..



హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం జరిగిన ఖమ్మం 'జనగర్జన సభ'లో ఏమైనా తప్పులు మాట్లాడినట్టు ఉంటే ఎలాంటి శిక్షకైనా తాను సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాహుల్‌ని విమర్శిస్తే తమను తాము విమర్శించుకున్నట్లే. 'మేం ఉండే వేదికపైకి బీఆర్ఎస్ నేతలను రానివ్వమ'ని రాహుల్ చెప్పారు. 75 రూపాయిలున్న పెన్షన్ 200 చేసింది మేమే.. 4000 పెన్షన్‌పై అనుమానాలుంటే చర్చ పెట్టండి. మేం అవగాహన కల్పిస్తాం. రాష్ట్రాల పరిస్థితులను బట్టి పాలసీలు ఉంటాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రాధాన్యత ఉంటుంద'ని రేవంత్ పేర్కొన్నారు. ఇంకా కేంద్రంలో పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రాహుల్ గాంధీ పదవి తీసుకోలేదని రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాహుల్ గాంధీ సహకరించారని.. రాష్ట్రం వచ్చిన తర్వాత ఈ పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలని చర్చకు సిద్ధామా అంటూ తెలంగాణ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

# ఇదే ఫైనల్ !

## ఏపీకి 66, తెలంగాణకు 34 శాతం..

## కృష్ణా జలాలపై కేంద్ర జలశక్తి స్పష్టత



అమరావతి, : కృష్ణా జలాల పున:పంపిణీ చేయాలంటూ తెలంగాణ చేస్తున్న వాదనలు సాంకేతికంగా, చట్టబద్ధంగా చెల్లుబాటయ్యే అవకాశాలు కనబడటం లేదు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డును అనుసరించి రాష్ట్ర పునర్విభజన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కుదిరిన అధికారిక ఒప్పందాలను తిరగదోడటం సాధ్యం కాదని కేంద్ర జలశక్తి నిర్దిష్టమైన నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు 2023–24 నీటి సంవత్సరంలోనూ కృష్ణాలో 66:34 శాతానికి కట్టుబడి పర్యవేక్షణ చేపట్టాలనీ, రూల్ కర్వ్ (నిర్వహణ, నియమావళి) ఖరారు చేయాలని కేఆర్ఎంబీ (కృష్ణా నదీ యాజమాన్య బోర్డు)కి కేంద్ర జలశక్తి నుంచి తాజాగా మార్గనిర్దేశకాలు అందినట్టు తెలిసింది. రిజర్వాయర్లు, సాగుయోగ్యమైన భూమి, నీటిపారుదలకు అవకాశమున్న స్థిరీకరణ ఆయకట్టును అనుసరించి బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా జలాల్లో ఏపీ 66, తెలంగాణకు 34 శాతం కేటాయింపులు చేసింది. (మిగతా 6లో..)

## మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్: కోకాపేటలో మైక్రోచిప్ టెక్నాలజీ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇవాళ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నాస్కామ్ ప్రకారం గత రెండేళ్లలో టెక్నాలజీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే సృష్టించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని మంత్రి కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నదని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో హైదరాబాద్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. దేశానికి లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ తన వర్క్‌ఫోర్స్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతోందన్నారు. వచ్చే దశాబ్దంలో ఆ రంగంలో భారత్ దూసుకెళుతుందన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మందికి స్వంత ఖర్చులతో శిక్షణ ఇస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కిలింగ్ రంగంలో కూడా తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోందన్నారు.

**అంబేద్కర్ భావజాలంలో బీహార్ ఇప్పుడు నడుస్తుందా..?**

(వివరాలు 4లో..)




## చంద్రయాన్-3 ప్రయోగ తేదీని ప్రకటించిన ఇస్రో చీఫ్



న్యూఢిల్లీ: చంద్రయాణ్-3 మిషన్‌ను ఈనెల 13వ తేదీన ప్రయోగించనున్నారు. ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ ఇవాళ ఆ విషయాన్ని తెలిపారు. జూలై 13వ తేదీన చంద్రయాణ్-3ని ప్రయోగించాలనుకుంటున్నామని, అయితే జూలై 19వ తేదీ వరకు తేదీని పొడిగించే అవకాశం ఉందన్నారు. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాణ్-3ని పంపనున్నారు. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే స్పేస్‌క్రాఫ్ట్‌ను మూన్ సర్ఫేస్‌పై దించాయి. అయితే ఆ మైలురాయిని అందుకోనున్న నాలుగవ దేశంగా ఇండియా మారనున్నది. చంద్రుడిపై ఉన్న చీకటి ప్రదేశంలో చంద్రయాణ్-3 రోవర్ ల్యాండ్ అవుతుంది. 14 రోజుల పాటు పనిచేసే విధంగా మూన్ మిషన్‌ను డిజైన్ చేశారు.

## మీరు మర్చిపోయారా.. శరద్‌పవారే మా పార్టీ జాతీయాధ్యక్షులు: అజిత్‌పవార్



ముంబై: శరద్‌పవారే తమ పార్టీ జాతీయ అధ్యక్షుడని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ చీలిక వర్గం నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎన్సీపీలోని అజిత్‌పవార్ వర్గం నాయకులు ముంబైలో ప్రెస్‌మీట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా లోక్‌సభ సభ్యుడు సునీల్ తట్కరేను ఎన్నుకున్నట్లు సీనియర్ నేత ప్రఫుల్ పటేల్ ప్రకటించారు. అదేవిధంగా తమ పార్టీ శాసనసభాపక్ష నేతగా అజిత్‌పవార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పటేల్ వెల్లడించారు. ఈ సందర్భంగా సునీల్ తట్కరే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అయితే, మరి జాతీయ అధ్యక్షుడు ఎవరని మీడియా ప్రతినిధులు స్పందించారు. అందుకు ప్రఫుల్ పటేల్ కంటే ముందే అజిత్ పవార్ స్పందించారు. 'మీరు మర్చిపోయారా..? మా పార్టీ జాతీయాధ్యక్షులు శరద్‌పవారే' అని ఆయన చెప్పారు.

# ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, జూలై 3 , ప్రజాపాలన :ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమితో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లంపల్లి పట్టణంలోని నంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన తోటపెల్లి రాజేశ్వర్ తాను తెలంగాణ ధూం-ధాం కళాకారుడిగా ఉద్యమంలో పని చేశానని, ప్రస్తుతం జీవనోపాధి చాలా కష్టంగా ఉందని, ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా 2వ విడత దళితబంధు పథకంలో అవకావం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన వేమినేన బుచ్చయ్య తనకు సారంగపల్లి గ్రామ శివారులో భూమి ఉందని, తాను పుట్టక నుండి ఇక్కడే నివసిస్తున్నానని, తనకు చెందిన భూమిని కొందరు సర్వే మార్చి దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమైన తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన కుందేల్ల వెంకటేష్ తాము వ్యవసాయంపై ఆధారపడి గ్రామ శివారులోని తమ భూమిలో పంటలు పండించుకుంటూ జీవిస్తున్నామని, సింగరేణి రోడ్ల గురించి కొంత భూమి పోగా మిగతా భూమిలో వేరొకరు ఆక్రమించుకొని తమపై దౌర్జన్యం చేస్తున్నారని, తాము కోర్టు ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకోవడం జరిగిందని, అయినప్పటికీ వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన కోవ మాన్కు తనకు తాత ముత్తాతల నుండి వారసత్వంగా సంక్రమించిన భూమి వేరొకరు అక్రమంగా ఆక్రమించకున్నారని, ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన అంకతి పోశయ్య, పెట్టెం భూమక్క, బాకం రామయ్యలు తమ దరఖాస్తులో తమకు గ్రామ శివారులో గల భూములను కొందరు అక్రమంగా ఆక్రమించుకొని పట్టాలు చేసుకున్నారని, ఇట్టి పట్టాలను రద్దు చేసి తమ పేరిట పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం గోపాల్వాడకు చెందిన పెద్ద కొమురయ్య తాను 1998లో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, మంచిర్యాల ద్వారా భూమి కొనుగోలు చేసిన సమయంలో అట్టి భూమిలోనికి వెళ్ళేందుకు దారి ఇచ్చారని, ఇప్పుడు అట్టి దారిని అక్రమంగా కబ్జా చేసి నా భూమిలోకి వెళ్ళకుండా అడ్డుకుంటున్నారని, ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, బెల్లంపల్లి ఆర్.డి.ఓ. శ్యామలాదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





స్నేహ గ్రూప్ అధినేత డాక్టర్ కె.శివ భాగ్య రావు తండ్రి అయిన కీర్తిశేషులు కటికల రామకోటి గారి 21 వర్ధంతి నీ పురస్కరించుకుని డాక్టర్ ఓ ఎన్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ మరియు ఆదర్శ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కేకేఆర్ ఎం అధినేత లయన్ కుసుమ భోగరాజు విద్యార్థినీ విద్యార్థులకు అన్న వితరణ చేస్తున్న దృశ్యం

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తొలి అమరుడు

**కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసిన పామేనా భీంభారత్**



చేవెళ్ల జులై 3, (ప్రజాపాలన): మండలకేంద్రంలోని ఇంద్రారెడ్డి చౌరస్తాలో దొడ్డి కొమరయ్య విగ్రహని కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు ఆవిష్కరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు పామేనా భీంభారత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూతెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయాన్ని భూమికోసం భుక్తి కోసం విముక్తి ఉద్యమం పోరాటంగా మారడానికిదొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణం నిజాం పాలనలో గ్రామాలలో జాగీర్దారులు దేశ్ముకులు భూస్వాములు దొరల దొరల అన్యాయాన్ని అరాచకాన్ని ఎదిరించిన వీరుడుఅన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కురవి,ప్రభాకర్,బ్యాగారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల పాఠశాల ప్రవేశాలకు ఎంపిక




శంకరపట్నం జూలై 03 ప్రజాపాలన రిపోర్టర్: తెలంగాణ రాష్ట్ర క్రీడల పాఠశాలల్లో ప్రవేశానికి శంకరపట్నం మండలం లోని మెట్టుపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకట నరసింహారెడ్డి తెలియజేశారు. ఈ ఎంపికకు మండలంలోని వివిధ పాఠశాలలో నాలుగు ఐదవ తరగతులలో చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 5వ తేదీ లోపు మెట్టుపల్లి పాఠశాలలో ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొనాలని ఎంఈఓ తెలియజేశారు. అధిక వివరాలకు పాఠశాలలో సంప్రదించవలసిందిగా తేలిపారు.

## వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్గా గుగులోతు లింగ్యా నాయక్ బాధ్యతల స్వీకరణ



వికారాబాద్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా జి. లింగ్యా నాయక్ సోమవారం మధ్యాన్నం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పదోన్నతిపై వికారాబాద్ జిల్లాకు అదనపు కలెక్టర్ గా బాధ్యతలను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

# దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం

**భూమికోసం భుక్తి కోసం ఉద్యమించునా యోధుడు**

**చేవెళ్లలో దొడ్డి కొమురయ్య నూతన విగ్రహావిష్కరణ**

**దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఎంపీ రంజిత్ రెడ్డి**

**వేలాదిగా తరలి వచ్చిన కురుమలు.**



చేవెళ్ళ జులై 04 (ప్రజాపాలన): తెలంగాణ సాయుధ పోరాటం తొలి అమరుడు దొడ్డి కొమరయ్య. ఆనాటి నిజాం కాలంలో గ్రామాలలో రజాకర్ల దొరలు జమిందార్ల దోపిడిని అన్యాయాలను అకృత్యాలను సహించలేక వారిపై తిరగబడి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ ను మండల కేంద్రంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఎంపీ రంజిత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అన్నారు. రజకర్ల దురాగతాల దుర్మార్గాలపై వీరోచితంగా పోరాడిన మహా వీరుడు కొమరయ్య అన్నారు. ఆయన తెలంగాణ సాధనకు కృషి చేశారన్నారు. ఆ పోరాట యోధునీ ప్రతిమ ఆవిష్కరించడం గర్వకారణం అన్నారు. కురుమలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. సమాజంలో గౌరవం దక్కలన్న గౌరవప్రదమైన జీవనం గడపాలంటే విద్యతోనే సాధ్యం అన్నారు. కురుమల విద్య ఆర్థిక అభివృద్ధి జరగాలంటే ప్రతి జిల్లాలో కురుమ సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఏర్పాటు చేయాలన్నారు. కురుమలు సాంకేతిక రంగాలలో ముందుకు సాగాలన్నారు. బర్లు గొర్లతో భావితరాల విద్య సాకారం కాదన్నారు. ప్రాచీన కళలలో ఓగ్గు కళాకారులకు మంచి నైపుణ్యం ఉందని వారి కాపాడు కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బడుగు బలహీనవర్గాలు ఆర్థికంగా విద్యాపరంగా ఎదిగినప్పుడే సామాజిక తెలంగాణ సహకారం అవుతుందన్నారు. దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం పోరాడి నేలకొరిగిన తొలి అమరుడు త్యాగధనుడు దొడ్డి కొమరయ్య అన్నారు. దేశంలో ఎందరో నేతలు సిద్ధరామయ్య అఖిలేష్ యాదవ్, లాలు యాదవ్ లాంటి పెద్ద నాయకులు ఉన్న కురుమల సంక్షేమం కోసం ఏమీ చేయలేదన్నారు. కురుమల సంక్షేమం కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కురుమ సంక్షేమ భవన్ ఏర్పాటు చేశారనీ అన్నారు. సీఎంతో చర్చించి కురుమల కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్న నాయకులకు ప్రభుత్వంలో గుర్తింపు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

**ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ....** తెలంగాణ భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడినయోధుడు తెలంగాణ సాయుధ రహితంగా తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. మనిషిని మహాశక్తిగా నడిపించిన ఖ్యాతి దొడ్డి కొమరయ్య దే అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో కురుమల సంక్షేమ భవనం ఏర్పాటు చేశానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమాలకిల్లా ఓరుగల్లు ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని చేవెళ్ల గడ్డపై పెట్టడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం,బీసీ కమిషన్ మెంబర్ సుబ్రజ్ పటేల్,అరుణోదయ సాంస్కృతిక మండలి నాయకురాలు విమలక్క,క్యామ మల్లేష్ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గె మల్లేష్ గ్రామ సర్పంచ్ బండారు శైలజ ఆగిరెడ్డి జడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి,ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, మండల కురుమ సంఘం అధ్యక్షులు కసిరే వెంకటేశం,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం ఎంపిటిసి గుండాల రాములు,పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి,డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అత్తేలి అనంత రెడ్డి, వంగలి యాదగిరి,మద్దెల జంగయ్య,అల్లి దేవేందర్ కురుమ సంఘం నాయకులు దండు సత్యం,మల్లేష్ శ్రీనివాస్,తరుణ్, రాం చెందర్ నత్తయ్య,మాణిక్యం,వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కురుమ సంఘాలు ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీ ఎదుగుదలకు అడుగులు

**ఎర్ర జెండా ఎగురడమే లక్ష్యం.బత్తుల బాబు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**



సైదాపూర్ ప్రజా పాలన జూలై 3 : దుద్దేనపల్లి,ఎగ్లాస్ పూర్,సోమారం,బూడిద పల్లి,వెన్నం పల్లి,లస్మన్న పల్లి,అరే పల్లి,గ్రామాలలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు బోయిని అశోక్,మండల నాయకులు కంది రవీందర్ రెడ్డి గార్లతో కలిసి పలు గ్రామాలలో ముఖ్యుల తో మాటా మంతి చెప్పట్టడం జరిగింది. పలు గ్రామాలలో అనేక మైనా సమస్యలు గా ఉన్నాయి మండలం లో ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే ఉంది. పేద ప్రజల కోసం ఎర్ర జెండా బయలు దేరింది మనకు మంచి రోజులు ముందట ఉన్నాయి. ప్రజా సేవకుడు, ప్రజల కోసం పరితపించే మనిషి రేకొండ వెంకన్న అని జనం ముచ్చటాడుకుంటున్నారు. రేపు ఉదయం 8 గంటలకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి గారు దుద్దెన పల్లి నుండి ప్రారంభమయి 9 గంటలకు ఎగ్లాస్ పూర్10 గంటలకు సోమారం11 గంటలకు బూడిద పల్లి12 అరే పల్లిలంచ్. బూడిద పల్లి2.00 గంటలకు వెన్నంపల్లి 3.గంటలకు లాస్మన్న పల్లి4.గంటలకు వెంకేపల్లి5. సైదాపూరు లో చాడ గారి పర్యటన ఉంటుంది కాబట్టి గ్రామ శాఖ కార్యదర్శులు,ప్రజా సంఘాల నాయకులు ,యువకులు,మహిళలు,అందరు కలిసి చాడ వెంకట రెడ్డి గారి పర్యటనను విజయ వంతం చేయగలరని తెలియజేస్తున్నాను. మీ బత్తుల బాబు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల ఇంచార్జ్

## బొగ్గు రవాణా ఆపాలని ఎస్.ఐ కు వినతిపత్రం



బోనకల్, జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద సైడింగ్ లో బొగ్గు ఎగుమతి దిగుమతి జరగటం వలన తమ నివాస గృహాలలోకి దుమ్ము దూళి రావటం వలన ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వెంటనే బొగ్గు దిగుమతిని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం స్టేషన్ పరిసర ప్రాంత ప్రజలు బోనకల్ ఎస్సై సాయికుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. దీనిపై స్పందించిన ఎస్ఐ సాయికుమార్ సదరు కాంట్రాక్టర్ ను పిలిచి బొగ్గు రవాణా జరిగే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, దుమ్ము ఏర్పడకుండా పట్టాలు ఏర్పాటు చేయాలని కేవలం రాత్రిపూట మాత్రమే బొగ్గు దిగుమతి చేయాలని, సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానికులు రావుట్ల సత్యనారాయణ గుగులోతు పంతు ,తెల్లాకుల శ్రీనివాసరావు, మచ్చ గురవయ్య, గంగూరి రాఘవరావు, నిమ్మల రాజశేఖర్, కారంగుల మురళి ,అంబటి సంపత్,వార్డు నెంబర్ ఉప్పర శ్రీను, వెంకట నరసయ్య డీలర్ కొండ,పర్సనబోయిన వీరభద్రం , నిమ్మతోట శ్రీను, సంతోష్,తాటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: సదాశివపేట పట్టణంలో ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గా భవాని మాత ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిసిసిబి ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యంను స్థానిక భక్తులు, యువత గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఫలహారం బండి ఊరేగింపు ముందు పోతురాజుల, వివిధ వేషధారణలు, కళాకారుల ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ ఊరేగింపు స్థానిక హట్కరిపేట మీదుగా దుర్గమ్మ ఆలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చింతగోపాల్, కొండాపూర్ ఎంపిపి మనోజ్ రెడ్డి, వైయస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ కోడూరి రమేష్,కౌన్సిలర్ సాతాని శ్రీశైలం, బిఆర్ఎస్ నాయకులు భిక్షపతి, ప్రేమనందం, మల్లేశం, పీఎంకే యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16న మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు



మంచిర్యాల టౌన్, జూలై 03, ప్రజాపాలన : మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుని ఎన్నిక ఈ నెల 16వ తేదీన మంచిర్యాల వైశ్య భవన్ లో నిర్వహిస్తున్నట్లు 2021–23 సంవత్సర అధ్యక్షులు దొంతుల ముఖేష్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తాను పదవి బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఈనెల 9 వ తేదీ ఆదివారం రోజున సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సంఘం యొక్క జామా ఖర్చుల బడ్జెట్ వివరాలు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈనెల 16 నిర్వహించే ఎన్నికల్లో పోటీ చేసే వారు ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వం తీసుకున్న వారు మాత్రమే అర్హులని సభ్యత్వం లేని వారు సభ్యత్వం తీసుకోవలసిందిగా మనవి చేసారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో భాగంగా ఈనెల 12వ తేదీ బుధవారం రోజున ఉదయం 10:00 గంటల నుండి 2:00 గంటల వరకు నామినేషన్ల స్వీకరించబడునని 13 వ తేదీ గురువారం రోజున ఉదయం 10:00 గంటల నుండి 2:00 గంటల వరకు విత్ డ్రా చేసుకోవచ్చునని తెలిపారు. 16 వ తేదీ ఆదివారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఎన్నికల నిర్వహించి, మధ్యాహ్నము 3:00 గంటల నుండి 5:00 గంటల వరకు లెక్కింపు నిర్వహించి సాయంత్రం 5:00 గంటలకు ఎన్నికైన నూతన అధ్యక్షుడిని ఎన్నికల అధికారులు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## జులై 6 నుంచి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

**సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



చేవెళ్ల జులై 3 (ప్రజాపాలన): చేవెళ్ల మండల కేంద్రం లోఎంపిడిఓ గారికి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12769 గ్రామపంచాయతీలలో దాదాపు 50 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారని వీరిలో పారిశుద్ధ కార్మికులు స్వీపర్లు పంపు ఆపరేటర్లు ఎలక్ట్రీషియన్లు డ్రైవర్లు కారోబార్లో బిల్ కలెక్టర్ తదితర కేటగిరీలో నర్సరీలు వైకుంఠధామం పార్కులో ఆఫీసు నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నారు గత 20, 30 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ పంచాయతీ సిబ్బందికి పర్మనెంట్, పనికి గుర్తింపు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 30% పిఆర్సి అన్ని శాఖల ఉద్యోగులకు ప్రకటించిన గ్రామపంచాయతీ కార్మికులను మరిచిపోయిందని అన్నారు దాని గురించే సమ్మె చేస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు దుద్దగు నర్సిమ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## అనంతరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



శంకరపట్నం జూలై 03 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం అంబల్పూర్ గ్రామవాసి ఆదివారం చికిత్స పొందుతూ మరణించిన బారాస గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ ఉపసర్పంచ్ తుమ్మేటి అనంతరెడ్డి భౌతిక కాయానికి సోమవారం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డాడు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు పట్నం అవినాష్ రెడ్డి (జడ్పీటీసీ)





ప్రజాపాలన ప్రతినిధి షాబాద్: షాబాద్ మండల్ చిన్న సోలి పెట్ గ్రామంలో పల్లె పల్లెకు పట్నం అవినాష్ రెడ్డి (జడ్పిటిసి) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య రావడం జరిగింది ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సోలిపేట గ్రామ ప్రజలు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేశారు.ప్రజా ప్రతినిధులు నాయకులు చైతన్యవంతులై ప్రజా సమస్యలను పరిష్కరిస్తేనే పార్టీ పటిష్టంగా ఉంటుందని అందుకు జడ్పిటిసి అవినాష్ రెడ్డి నిర్వహిస్తున్న పల్లె పల్లెకు కార్యక్రమం నిదర్శమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. షాబాద్ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి 15 రోజులపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న పల్లె పల్లెకు అవినాష్ రెడ్డి కార్యక్రమాన్ని ఆయన మండలంలోని సోలిపేట పంచాయతీలో ప్రారంభించారు. పల్లెబాటను ప్రారంభించిన అవినాష్ రెడ్డి ముందుగా సోలిపేట గ్రామంలో దేవాలయంలో పూజలు చేసి, అనంతరం చర్చిలో ప్రార్థనలో పాల్గొన్నరు అనంతరం పెద్ద సోలిపేట మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో వాడల్లో పాదయాత్ర నిర్వహించి అవినాష్ రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. గతంలో గ్రామానికి అందించిన నిధులను అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇంకనూ కావాల్సిన నిధుల కోసం సర్పంచ్ రమ్యకృష్ణ, ఎంపీటీసీలత మహిపాల్ రెడ్డి గ్రామ ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ షాబాద్ మండలంలోని అన్ని గ్రామాలలో మిగిలిపోయిన సమస్యలను పరిష్కరించేందుకు పల్లె పల్లెకు అవినాష్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ పార్టీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో ప్రతి పల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు వివరించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరగా వెంటనే రాజేంద్ర డిపో మేనేజర్ తో సంప్రదించారు. గ్రామస్తులు పెన్షన్ల కోసం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం, విద్యుత్ స్తంభాల కోసం సంబంధిత అధికారులను మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింగ్ రావు, మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్ గౌడ్, స్వప్న నరసింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు చాంద్ భాషా, మాజీ సర్పంచ్ దర్శన్,మాజీ ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ ఫయాజ్, సర్పంచ్ లు శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు జడల రాజేందర్ గౌడ్, మర్పల్లి కృష్ణారెడ్డి,దేవేందర్ రెడ్డి, రాజుగౌడ్, ముఖరమ్ ఖాన్,వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్ ముందు భారీ ధర్నా



మంచిర్యాల టౌన్, జూలై 03, ప్రజాపాలన: చెన్నూర్ లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రోజున మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు ఫైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని పేదలకు ఇస్తా అన్న మూడు ఎకరాల భూమి డబుల్ బెడ్ రూం లు ఇండ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి 5 లక్షలు నేటికి ఇవ్వకపోవడం చాలా దారుణం ఎక్కడ ప్రభుత్వ భూమి కనబడితే అక్కడ అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేస్తూ, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకోని ప్రభుత్వం పేదోడికి గజం భూమి ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వానికి భూమి దొరకడం లేదా అని ప్రశ్నించారు.చెన్నూరు లోని బావు రావుపేట శివారు సర్వే నెంబర్ 8 లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జాదారులు అక్రమ పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. వాటిని వెంటనే రద్దు చేసి గుడిసెలు వేసుకున్న పేదల ఇండ్లకు ఇంటి పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన ప్రకారం గృహలక్ష్మి పథకానికి మూడు లక్షల రూపాయలు ఇస్తానని చెప్పిందో దానిని ఐదు లక్షలు చేస్తూ గుడిసె వేసుకున్న పేదలకు వర్తింపజేయాలని కోరారు. కోటపల్లి,చెన్నూరు,వేమనపల్లి, భీమారం,జైపూర్ కాలేశ్వరం బ్యాక్ వాటర్ ద్వారా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ చెన్నూరులో గుడిసెలు వేసుకున్న పేదలపై భూ కబ్జా దారులు రాత్రి, పగలు నిత్యం దాడులు చేస్తూ భయ పెడుతున్నారని దాడులు చేస్తున్న భూకబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకొని చట్టపరంగా కేసులు నమోదు చేసి, గుడిసెలు వేసుకున్న పేదలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనగారపు అశోక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడేంకి చందు,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఐఐఐటిలో సీటు సాధించిన ఆలేరు ఎన్. సి. సి. విద్యార్థి జూకంటి ప్రణదీప్




యాదాద్రి భువనగిరి జిల్లా 3 జులై ప్రజాపాలన:ఎన్.సి.సి తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి అని ఆలేరు ఎన్.సి.సి. అధికారుల వెంకటేష్ దూడల అన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్షం ఆలేరు పాఠశాల విద్యార్థి జూకంటి ప్రణదీప్ అని అన్నారు.ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జూకంటి ప్రణదీప్, బాసర లోని త్రిపుల్ ఐటీ లో సీటు సంపాదించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరేపల్లి నారాయణ, ఎన్. సి. సి. అధికారి దూడల వెంకటేష్ తెలిపారు. సోమవారం నాడు బాసర ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రకటించిన పట్టికలో జూకంటి ప్రణదీప్ కు సీటు లభించింది. 2022–23 లో పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన జూకంటి ప్రణదీప్ ఐఐటి లో సీటు సాధించటం పట్ల పాఠశాల విద్యాకమిటి చైర్మన్ సీస గోవర్ధన్, ఉపాధ్యాయులు శ్యామసుందరి, కోటగిరి శేఖర్, మంద సోమరాజు, హరినాథ్ రెడ్డి, యోగేశ్వరరావు, మురళి, సాంబశివ, ఖాజా అలీ, నవీన్ కుమార్, సత్యనారాయణ, రవి, వేణు, శ్యామసుందరి, కవిత, మేరీ స్వరూప రాణి, , లక్ష్మమ్మ, స్వర్ణలత, మీరా, దుర్గమ్మ సీఆర్పీ తిరుపతి తదితరులు అభినందించారు.

## నూతనమార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాస్ వైస్ చైర్మన్ గా కటికల సత్యనారాయణ రెడ్డి



మధిర రూరల్ జూలై 3 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక మార్కెట్ యాడ్ లో ఏర్పాటు చేసిన నూతన మార్కెట్ కమిటీ చైర్మన్గా వైస్ చైర్మన్ గా పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రోడ్ ఎమ్మెల్సీ కొండబాల కోటేశ్వరావు డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం బొమ్మెరి రామ్మూర్తి మున్సిపల్ చైర్మన్ మొండితోక లత నల్లమల్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులను చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణం స్వీకారానికి చేసిన పాలకవర్గ సభ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా ఉంటూ రైతులు ఉచిత కరెంటు 24 గంటలు ప్రజల మందల పొందుతున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తూ పలువురికి ఆదర్శ ఉంటున్న మన ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న రోజుల్లో మూడోసారిగా ముఖ్యమంత్రి కేసీఆర్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు ఉంటుందని వారు తెలిపారు ఈ నియోజకవర్గంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు స్థానిక ఎమ్మెల్యేగా మీరందరూ కలిసి బిఆర్ఎస్ అభ్యర్థిగా గెలిపించాలని వారు తెలిపారు అదేవిధంగాతెలంగాణ రాకముందు మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్లు లేవు.తెలంగాణ వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ దేరాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నిటినీ పూర్తిచేశారుప్రభుత్వమే రైతుల ధాన్యాన్ని కళ్లాల వద్ద కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వాన్ని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఐదు మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు కార్యదర్శులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు మధిర బిఆర్ఎస్ అధ్యక్షులు రావూరు శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరు వెంకటేశ్వరరావు ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కోటేశ్వరావు చావా వేణు వార్డు కౌన్సిలర్లు గ్రామ సర్పంచులు రైతులు పాల్గొన్నారు

## షాబాద్ సిఐ గా నూతన బాధ్యతలు స్వీకరించిన పి.యాదయ్య గౌడ్



ప్రజాపాలన ప్రతినిధి షాబాద్ :షాబాద్ సిఐ గా విధులు నిర్వహిస్తున్న గురువయ్య గౌడ్ ను క్రైమ్ వింగ్స్ కు బదిలీ చేయగా అయినా స్థానంలో సిఏటిలో ఉన్న యాదయ్య గౌడ్ ను షాబాద్ సిఐగా నియమించారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
మంగళవారం 04, జులై 2023

# కోటి రత్నాల వీణాగానం సాయిచంద్

కొత్తతరం ప్రజా గాయకుల్లో సాయిచంద్ ఒక గాన సునామీ. ఒక సాంస్కృతిక విస్ఫోటనం. మలిదశ తెలంగాణ ఉద్యమ గమనానికి సాయిచంద్ ఒక సాంస్కృతిక రహదారిగా భాసిల్లా డు. తెలంగాణ ఉద్యమ సముద్ర గర్భంలో దాగిన బడబానలాన్ని తన పాటల కరంటు తీగెలతో మోసుకెళ్లి ప్రతిపల్లెను జగజ్జేగీయమానంగా వెలిగించాడు. సాయిచంద్ గొంతెత్తితే 'కోటి రత్నాల వీణ' మీటినట్టుంటుంది. పాలమూరు మట్టిగోస భాషించినట్టుంటుంది. సాయిచంద్ పాట వింటే సమరోత్సాహం రగులుతుంది. బహిరంగసభ కండ్లు ఎరుపెక్కుతాయి. భగభగమంటూ ప్రజాకోటి ఉక్కు పిడికిలి బిగిస్తుంది. అతని ఉపన్యాసం నిప్పుల ఉప్పెనలా సభాసదులను ముంచెత్తుతుంది. అమరుల గురించి పాడినా, అంబేద్కర్ గీతం ఆలపించినా గుండెను సముద్రంగా మార్చే పరమ ఆర్ద్రమైన అగ్నికంఠ గానం సాయిచంద్ సొం తం. ఉద్వేగభరితమైన పాటతో, ఉత్తేజకరమైన మా ట తో ఒక సాంస్కృతిక సౌధాన్ని నిర్మించి, లక్షలాది మంది ప్రజలను గంటల తరబడి అందులో బంధించే సమ్మోహనశక్తి సాయిచంద్‌లో కనిపిస్తుంది. అందుకే అతనిపాట ప్రవాహం అమరచింత నుంచి అమెరికా వరకు ప్రతిధ్వనించింది. తాత చెన్నయ్య ఆలపించే భజన పాటలతో, తండ్రి వెంకటరాములు పాడే ప్రజాగీతాల చరణాల జాడల్లో, అమరచింత నేర్పిన ఆటపాటల ఒరవడిలో సాయిచంద్ బుడిబుడి నడకలు నేర్చుకున్నాడు. అరుణోదయ కళాకారులైన కానూరి, నాగన్న ల గాన కళా వారసత్వాన్ని అందిపుచ్చుకున్నాడు. ఆరేండ్ల ప్రాయం నుంచే పాటలు పాడే సాయి పాటల పోటీలో 'నీ కన్నీరు నా కన్నీరు కలిగినోళ్లకు పన్నీరా యే' అనే పాట పాడి బాల గద్దర్‌లా కదం తొక్కాడు. హైదరాబాద్‌లో ఉన్నత చదువు అభ్యసిస్తూనే, మరొక వైపు విద్యార్థి నాయకునిగా, యువ గాయకునిగా ప్రజా పోరాటాల్లో పాలుపంచుకున్నాడు. మలిదశ తెలంగాణ ఉద్యమం సాయిచంద్ జీవన ప్రస్థానాన్ని మరో మలుపు తిప్పింది. తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్షతో రగులుకున్న ఉద్యమాగ్నిజ్వాలల వెలుగుల్లో, శ్రీకాంతాచారి లాంటి అమరవీరుల బలిదానాల ఉద్విగ్న సం దర్భంతో సాయిచంద్ ప్రభావశీలమైన ప్రజాగాయకుడిగా రూపుదిద్దుకున్నాడు. మిట్టపల్లి సురేందర్ రాసిన 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా' అనే పాటను సాయిచంద్ ఆలపిస్తుంటే తెలంగాణ మొత్తం ఒక బాధాసరిత్సాగరమై బావురుమన్నది. కేసీఆర్‌తో పాటు కోట్లాదిమంది తెలంగాణ బిడ్డల గుండెలు కన్నీటి ఊటచెలిమలై ఉప్పొంగాయి. గోరటి వెంకన్న రాసిన 'వాగు ఎండిపాయెరో' అన్న పాట సాయిచంద్ పాడుతుంటే ప్రేక్షకుల హృదయాలు దుందుభి నదులయ్యాయి. కేసీఆర్ రాసిన 'వలసలతో వలవల విలపించే కరువుజిల్లా పాలమూరు' అనే పాట ఆలపిస్తుం టే అఖిల జనావళి గుండె బరువెక్కేది. తాను పాడే పాటలో పరివ్యాప్తమైన భావోత్తేజాన్ని, ఉద్యమావేశా న్ని సంపూర్ణంగా ఆవాహన చేసుకొని ఆ భావప్రకంపనలను తన గళంలో ఒంపుకొని, గానంలో నింపుకొని, సాయిచంద్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాడు. తెలంగాణ గాయాలను ఎంతో ఆర్ద్రంగా ఆలపించిన సాయిచంద్ తెలంగాణ ఉద్యమ విజయాలను, రాష్ట్ర ప్రగతి గేయాలను కూడా మరింత ఆత్మవిశ్వాసంతో గానం చేశాడు. తెలంగాణ నాయకులకు తలలోని నాలుకలా విలసిల్లాడు. సాయిచంద్ గొప్ప గాయకుడే కాదు, ప్రభావశీలమైన కవి కూడా. తెలంగాణ ఉద్యమ సందర్భంలో జైలు నిర్బంధాలను పరమానందంగా భరించాడు. తనువారా లాఠీదెబ్బలు తిన్నాడు. 'కంఠంపై కత్తిపెట్టి, కణతపై తుపాకీ పెట్టి/ కడసారిగా పలకమంటే, పలికే చివరిమాట కూడా జై తెలంగాణ' అంటూ రాజ్యం గుండెలదిరేలా వేయి గొంతుకలతో నిప్పుల నినాదాల ను అణువణువులో ప్రసరించాడు. 'పారిన వీరుల రుధిరం తెలంగాణ తల్లికి నుదుటి తిలకమైందని' అమరుల త్యాగచింతనతో అభివర్ణించాడు. 'తంగేడు బతుకమ్మ తలమీద గౌరమ్మ' అనే తన గీతంతో విశ్వవిఖ్యాతమైన పూలపండుగ పరిమళాలను వెదజల్లా డు. 'అనురాగాల పల్లవి అమ్మ ప్రేమ/ మమతల కోవెల మణిదీపం' అంటూ సాయిచంద్ కన్న తల్లి మణెమ్మను తీయని ఆత్మీయతను అక్షరబద్ధం చేశాడు. 'నాన్న నాన్న నీ మనసెంత మంచిదో నాన్న' అంటూ నాన్న వ్యక్తిత్వాన్ని అద్భుతమైన పాటగా మలిచాడు. 'కష్టమంత భద్రంగా కడుపులోనే దాచుకొని, కన్నీళ్లను కంటిరెప్ప దాటనీయని' తండ్రి మహోన్నత పాత్రను సాయిచంద్ అద్భుతంగా తనపాటలో బొమ్మకట్టించాడు. అమ్మానాన్నల ఔన్నత్యాన్ని కీర్తిస్తూ విశ్వ జనీన దృష్టితో సాయిచంద్ రాసిన, ఆలపించిన ఈ పాటలు ఎంతోమందిని కదిలించాయి. తల్లిదండ్రుల యాదిని గుండెల్లో కుమ్మరించాయి. 'గంప కింద మూసి పెట్టిన కోడి కూతలిని/ ఆ తూరుపమ్మ పొత్తిళ్లలో పొద్దు పొడుస్తది/ ఊరి నట్ట నడుమ ఉన్న రావి చెట్టుమీద పక్షుల పిలుపులతో పల్లె తెల్లవారుతుంది' అంటూ ఉషోదయ దృశ్యాన్ని కళాత్వ శోభితంగా వర్ణించాడు. 'మేము కళాకారులం/ కళాబాటసారులం/ కళయే మా జీవితం/ కళకే మేమంకితం/ గాత్రమే జీవన సూత్రంగా బతుకుతాం' అంటూ సాయిచంద్ ఉదాత్తమైన కళాకారుల జీవన స్థితిగతులను, వారి అసాధారణ ప్రతిభా పాటవాలను సమున్నతంగా చిత్రించాడు. మా ఆకలి కడుపులపై కంజిర దరువేస్తాము/ మా ఎండిన డొక్కలపై డప్పులు మోగిస్తాము/ మా పేగులు తీగెలుగా కిన్నెర వాయిస్తాము/ మా ఊపిరితిత్తులతో మురళిని పలికిస్తాము/ మా పెదవులపై పదముల నాట్యం చేయిస్తాము/ మా పల్లె జానపదుల పల్లకినే మోస్తాము' అంటూ తన పాటలో సాంద్రతరమైన గేయకావ్య స్ఫూర్తిని సాయిచంద్ చాటిచెప్పాడు. పాట లు పాడే క్రమంలో కళాకారులు అనుభవించే మేధోపరమైన వేదనను, శ్రమగతమైన కష్టనష్టాలను అభివ్యక్తి సుందరంగా సాయిచంద్ విశ్లేషించాడు. జానపదుల సంగీత, సాహిత్య, కళావారసత్వ మహత్తును చాటిచెప్పాడు. సాయిచంద్ ఎం.ఏ తెలుగు చదివినప్పటికీ నిఘంటువుల భాషకు భిన్నం గా జానపదుల భాషతోనే తన పాటలకు పుటం పెట్టుకున్నాడు. సాయిచంద్ తెలంగాణ ఉద్యమ చైతన్యంతో పాటు దళితోద్యమ స్ఫూర్తిని కూడా తన పాటల్లో పలికించాడు. దళిత తాత్విక భావజాల సమన్వితమైన గీతా లు రచించాడు. 'బాబా అంబేద్కరా మా బతుకులకు భాస్కరా/ మీరే లేకుంటే మేమేమై పోతుంటిమో' అంటూ అంబేద్కర్ బహుముఖీన ప్రాశస్త్యాన్ని కీర్తిస్తూ ఆ విజ్ఞానమూర్తి, సాహసమూర్తి, త్యాగమూర్తి లేకపోతే దళితులు బుగ్గయి పోయేవారని సాయి పాడుతుంటే అశేష జనసముద్రం జైభీమ్ అంటూ పోటెత్తిం ది. ప్రతిభావంతుడైన గాయకునిగా, కవిగా, వక్తగా, వర్తమాన వాగ్గేయకారునిగా ప్రజాకోటి హృదయపీఠం పై కొలువుతీరిన సాయిచంద్ అత్యున్నతమైన ఆ పీఠా న్ని విడనాడి అందరినీ దుఃఖ సాగరంలోముంచి భస్మసింహాసనాన్ని అధిరోహించాడు. 'పాటమ్మ అడిగినాది నాకొడుకు ఏడని? పల్లె అడిగినాది నా బిడ్డయాడని' అని అరుణోదయ రామారావు స్మృతిలో సాయిచంద్ విలపించినట్టుగానే ఇప్పుడు యావత్ తెలంగాణ కలవరిస్తున్నది నా కళాబాటసారి ఏడని? పాటమ్మ బోరున ఏడుస్తున్నది తన గారా ల, గానాల బిడ్డ సాయిచంద్ ఏడని?

# అంబేద్కర్ భావజాలంలో బీహార్ ఇప్పుడు నడుస్తుందా..?

భారత రాజకీయాల్లో ఈనాడు గుణాత్మకమైన మార్పు బీహార్‌లో కనిపిస్తుంది. బిజెపి నుండి జె.డి.యు. నితిష్ కుమార్ నాయకత్వంలో విడిపోయి కాంగ్రెస్, సి.పి.ఐ.(ఎం.ఎల్.), సి.పి.ఎం., సి.పి.ఐ, మజ్లిస్, స్వతంత్రులు కలిసి ప్రభుత్వాన్ని రూపొందించడం బి.జె.పి.కి. గొడ్డలి వేటు. జె.డి.యు., ఆర్.జె.డి, కాంగ్రెస్, వామపక్షాల కలయిక బి.జె.పి. మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించే బహుజన లౌకిక వాద రాజకీయాలకు పతాకలెత్తడమే. బి.జె.పి రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించి అటు మహారాష్ట్రలో శివసేనను విడదీసి విచ్ఛిన్న రాజకీయాలను చేసింది. ఇటు తెలంగాణలో కూడా కాంగ్రెస్‌లో గెలిచిన, టి.ఆర్.ఎస్.లో గెలిచిన అభ్యర్థులను ధనం, పదవి ఎరవేసి తమ పార్టీలో చేర్చుకుంటుంది. పరిపాలిస్తున్న పార్టీలను సంక్షోభంలోకి నెట్టివేస్తుంది. బీహార్‌లో కూడా అదే ప్రయత్నం చేయబోయింది. అయితే బీహార్‌లో మతాతీతంగా బలమైన రాజకీయాలు నడుపుతున్నారు. నిజానికి బి.సి.లు హిందువులు కాదు. బౌద్ధులు, నితీష్ కుమార్, తేజస్విని యదావ్‌లు కలవడం, కాంగ్రెస్, వామపక్షాలు మద్ధతు ఇవ్వడం గొప్ప పరిణామం. భారతదేశంలో బి.సి.లు, ఎస్సీలు, మైనారిటీలు కలుసుకుంటే మొత్తం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ వీరివే. బహుజన రాజకీయాల్లో ఉత్తరప్రదేశ్‌ను విచ్ఛిన్నం చేసింది. బి.జె.పి. అభిషేక్ యాదవ్‌ను, మాయవతిని విడదీసి, ముస్లింలను నిషేధించి పక్కకు నెట్టారు. అక్కడ మతం పేరుతో, రామాలయాల పేరుతో ఓట్లను సమీకరించింది. బీహార్‌లోని సమీకరణల పద్ధతిలో యు.పి.లో కూడా మాయావతి, అభిషేక్ యాదవ్‌లు ఏకమైతే బి.జె.పి. కుప్పకూలిపోయింది. బి.జె.పి.కి నైతిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయాలు లేవు. అది మతాన్ని రెచ్చగొట్టి కార్పొరేట్ ఆధీనంలో పాలిస్తుంది. రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి బి.సి.లకు, దళితులకు రావలసిన హక్కుల్ని కాలరాసి మతోన్మాద చర్యలతో హత్య, అణచివేత రాజకీయాలను కొనసాగిస్తుంది. దీన్ని ముందు బీహార్ గుర్తించడం అందునా బి.సి.లోని యాదవులు గుర్తించడం పెద్ద గుణాత్మకమైన రాజకీయమనవచ్చు. డా.బి.ఆర్.అంబేద్కర్. రామ మనోహర్ లోహియా అణగారిన కులాలని ఏకం చేసి అగ్రకులాల మతోన్మాద రాజకీయాలను కూలదోయాలని చెప్పారు. బి.జె.పి., ఆరెస్సెస్ భారతదేశ సాంస్కృతిక, తాత్త్విక మూలాలను ధ్వంసం చేసే ప్రయత్నాలలో ఉన్నాయి. ముఖ్యంగా రాముణ్ణి ముందుకు తేవడం ద్వారా ప్రత్యర్థిని నిర్జరించడం తప్పుకాదనే ఆలోచనలో ఉన్నాయి. భారతదేశంలో బ్రాహ్మణులు, కాయస్తులు, మార్వాడీలు భారతదేశ స్వాతంత్ర్య కాలంలోనే ఏకమయ్యారు. స్వాతంత్ర్య భారత సంపదనంతా రాజ్యాధికారం ద్వారా



కొల్లగొట్టే వ్యూహాన్ని రచించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు దళితులకు, బహుజనులకు రాజ్యాధికారం దక్కకుండా భారత, రామాయణాల్లోని వధ సంస్కృతిని కొనసాగిస్తూ వస్తున్నారు. నిజానికి బి.సి.కులాలు సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్రలో ఉన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్భై ఐదేళ్లు అవుతున్నా బి.సి.ల జనగణన చేయకపోవడంలోనే కుట్ర దాగి వుంది. ఇప్పటికీ చాకళ్లు, కమ్మర్లు, కుమ్మర్లు, మంగళ్లు, మేదర్లు, యాదవ, గౌడ, పద్మశాలీలు వంటి అనేక కులాలు పేదరికంలో మగ్గి పోతున్నాయి. వారిని హిందువులుగా పిలిచి వారి ఓట్లను బి.జె.పి. తస్కరిస్తుంది. ఈ బి.సి.కులాల వృత్తులన్నీ సంక్షోభంలో ఉన్నాయి. బి.సి. కులాలకు రాజ్యాధికారంలో జనాభా నిష్పత్తిని బట్టి సీట్లు ఏ పార్టీ ఇవ్వడంలేదు. రాజ్యాధికారం లేకుండా మన సమస్యలు పరిష్కరించబడవని అంబేద్కర్ ఎప్పుడో చెప్పాడు. ఇక దళితులపై బి.జె.పి. ఆరెస్సెస్ నిరంతరంగా జరుపుతున్న దాడులకు అంతులేదు. దళితులను మనుస్మృతి ప్రకారం నీచ కార్యాలకే ఉపయోగించాలని, అత్యున్నతమైన చదువులకు పనికిరారని ఇతర దేశాలకు దళితుల్ని పంపించే స్కాలర్ షిప్‌లను రద్దు చేశారు. అన్ని కేంద్రీయ విశ్వ విద్యాలయాల ఎస్సీ రిజర్వేషన్ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదు. కొత్తగా పోస్టులని నింపడం లేదు. దళితులను ఏ కార్పొరేట్ వ్యవస్థా చేర్చుకోకుండా నిరోధించారు. భారతదేశంలోని ఏడు లక్షల గ్రామాల్లో దళితులున్నారు. నాలుగు లక్షల గ్రామాల్లో విద్యుత్తు లేదు, నీరు లేదు, శ్మశాన భూమిలేదు, రోడ్లు లేవు. దళితులను నిర్భర దారిద్ర్యంలో ఉంచి వారి శరీర, మానసిక వ్యవస్థలను క్రుంగదీసి వారు పనిచేయలేని స్థితికి కూడా తీసుకొచ్చి వారి జనాభాను ఎంత నిర్మూలించ గలిగితే అంత నిర్మూలించాలనేదే అరెస్సెస్ తీర్మానం. ఆరెస్సెస్, బి.జె.పి. మొత్తం భారతదేశంలో దళితుల సంస్కృతిని, లౌకిక, బౌద్ధిక శక్తులను నిర్వీర్యం చేసే సంస్కృతీ ప్రణాళికను కార్పొరేట్ వ్యవస్థతో మిలాఖాత్ అయ్యి నిర్వహిస్తుంది. "అగ్నిపథ్" మిలటరీ రిక్రూట్మెంట్ చట్టంలో ఎక్కువమంది దళిత బహుజన విద్యార్థులున్నారనే వారి నిరోధానికి పథకం వేశారు. మొత్తం భారతదేశంలో సాంఘిక వ్యవస్థని కూల్చివేసి చాతుర్వరణ వ్యవస్థను పున్ణస్థాపించాలనే దూర్వ్యూహంలోనే భాగంగానే బి.జె.పి, ఆరెస్సెస్ పావులు కదుపుతున్న ఈ సందర్భంలో బి.సి.లు, దళితులు, లౌకిక వాదులు కలిసి ఈ రోజున బీహార్‌లో మతేతర కుల సమీకరణల రాజకీయ వ్యూహానికి నితీష్ కుమార్, తేజస్వీని యాదవులు తెరలేపడం ఒక రాజకీయ పరిణామంగా మనం భావించాలి. స్వాతంత్ర్యం వచ్చి డెబ్భైఐదు సంవత్సరాలు అవుతున్నా మనం వందకు వందమందికి అక్షరాలు నేర్చుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాం. దేశంలోని మొత్తం విద్యార్థుల సంఖ్య ఈ రోజు 46.5 కోట్లు మాత్రమే. అంటే వంద కోట్ల కుటుంబాలలో ఇంకా విద్యా గంధం ప్రవహించలేదు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పన్నెండు శాతం అక్షరాస్యత ఉంది. అప్పటికే బ్రిటీష్ వారు గానీ, సంస్థానాధీశులు గానీ రెండు లక్షల పదివేల పాఠశాలలు పెట్టారు. ఇప్పుడు పదిహేను లక్షలకు చేరుకున్నాం. పది లక్షల పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, కుర్చీలు, బెంచీలు, చాక్‌పీస్‌లు కూడా లేవు. పాఠశాలలకు ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు లేవు. ఆంధ్రప్రదేశ్ లోనైతే పాఠ్యపుస్తకాల పంపిణీ సక్షోభం నిరంతరంగా కొనసాగుతుంది. ఏకోపాధ్యాయ పాఠశాలలే నాలుగు లక్షలు ఉన్నాయి. అందుకు ప్రభుత్వాలు ఏమీ బాధపడటం లేదు. కారణం వీరికి నిరక్షరాస్యత, అస్పృశ్యతా వర్ణ వివక్ష భారతం కావాలి. ఒక పక్క దళిత బహుజన మేధావులు, ఆలోచనాపరులు పెరుగుతున్నారు. అందుకే ఇప్పుడు దళిత బహుజన మైనారీలు రాజకీయంగా ఏకమవ్వాల్సిన సమయం వచ్చింది. ఈ ఏకీకృత రాజకీయాలకు సిద్ధాంత భూమిక అంబేద్కర్ – లోహియా– పెరియార్ రామస్వామి నాయకర్ ఇచ్చారు. ఇవాళ తమిళనాడులో ఆరెస్సెస్, బి.జె.పి. పాదం మోపలేనంత బలంగా అక్కడి రాజకీయాలు ఉండడానికి కారణం అక్కడ పెరియార్ వేసిన లౌకిక వాద రాజకీయ పునాదే. ఈనాడు కులనిర్మూలన భారతదేశ పునర్ నిర్మాణ ఉద్యమం జరగాలి. అందుకు రాజ్యాధికారమే కీలకమైన విషయం. మెజారిటీ ప్రజల రాజకీయ ఐక్యతే ప్రధాన సూత్రం. అంబేద్కర్ – లోహియా– పెరియార్‌ల రాజకీయ నిర్మాణ సూత్రాలను తప్పక బీహార్ నూత్న సమీకరణాల ప్రభుత్వం ఎజెండాగా స్వీకరించాలి. అప్పుడు నితీష్ కుమార్ ఎనిమిదవ ముఖ్యమంత్రి అయిన సందర్భంగా ఈ సిద్ధాంతాల ప్రతిఫలం జరగకపోతే అవకాశవాద రాజకీయాలే మళ్లీ ప్రతిఫలిస్తాయి. ముఖ్యమంత్రి ఎన్నిసార్లు అయ్యిందనేది కాదు, సంపద అందరికికీ పంచబడుతుందా? కుల నిర్మూలన ఆచరణ ప్రతిఫలిస్తుందా? అనేది ముఖ్యం. ఏనాటికైనా భారత రాజ్యాంగమే భారతదేశ పరిపాలనకు గీటురాయి. ఆ దిశగా నడవాల్సిన బాధ్యత బీహార్ కొత్త ప్రభుత్వానికి ఉంటుందని ఆశిద్దాం.



– మహాకవి డా॥ కత్తి పద్మారావు
సామాజిక ఉద్యమ నాయకులు
9849741695

# స్మారక సదనం విలువ పెంచే పరిశోధనలు కావాలి

తెలంగాణ యోధుల మ్యూజియం 'అమర జ్యోతి'ని ముఖ్యమంత్రి కేసీఆర్ జాతికి అంకితం చేశారు. ఇక ఆ స్మారక సదనాన్ని నిజమైన, ఆకర్షణీయమైన స్ఫూర్తి కేంద్రంగా తీర్చిదిద్దుకునే బాధ్యత పరిశోధకులపైన ఉంది. అమరజ్యోతి భవనం లోపల ఆయా అమరుల స్మారకాలు, రచనలు, ప్రసంగాల ఆడియో వీడియో క్లిప్పులను చూసి తెలంగాణ యువత స్ఫూర్తి పొందే విధంగా పరిశోధన జరగాలి. అలాగే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ముఖ్యంగా నాలుగు కోణాల్లో పరిశోధనలు సాగించి ప్రదర్శనలు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుంది. అవి: 1) అమరుల స్మారకాల ప్రదర్శన, 2) అమరుల పోరాట ఘట్టాల ప్రదర్శన, 3) అమరుల కథనాల ప్రదర్శన, 4) అమరుల గాథల ప్రదర్శన. అమరుల స్మారకాల ప్రదర్శనలో భాగంగా ప్రత్యేకమైన గ్యాలరీలలో 1879–2014 మధ్య, అంటే ఆ 135 సంవత్సరాల కాలంలో తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వందలు, వేలాది అమరుల ఫోటోలు, చిత్రాలు, విగ్రహాలు, వారి ఇళ్ళు, వారు పోరాడిన స్థలాలు, అమరత్వం పొందిన స్థలాలు, వారి సంతకాలు, లేఖలు, డైరీలు, రచనలు మొదలైనవి సేకరించి ప్రదర్శనకు పెట్టాలి. అలాగే అమరుల పోరాట ఘట్టాల ప్రదర్శనను ఆకర్షణీయంగా మలచడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ఇందుకోసం ఆయా పోరాట ఘట్టాలు జరిగిన ప్రదేశాలపై సేకరించగలిగిన ఆడియో వీడియో క్లిప్పింగులను



చొప్పించుకుంటూ కొత్తగా కూడా నిష్ణాతులతో షూటింగ్ చేయించి ప్రేక్షకులకు స్ఫూర్తిని కలిగించే విధంగా ఏర్పాట్లు చేయాలి. ఇందుకు ఏ.ఆర్ (ఆగ్మెంటెడ్ రియాలిటీ), వి.ఆర్ (వర్చ్యువల్ రియాలిటీ), ప్రొజెక్షన్ మ్యాపింగ్, వాక్ త్రూ మొదలైన టెక్నాలజీలను వాడాలి. ఇప్పటికే ఇలాంటి టెక్నాలజీలను అహ్మదాబాద్‌లోని దండి కుటీర్ (ఉప్పు సత్యాగ్రహం) మ్యూజియంలో, ఢిల్లీలోని ప్రధానమంత్రి సంగ్రహాలయంలో వినియోగించారు. అలాగే ఈ ప్రదర్శనలో కథనాలనూ భాగం చేయాలి. ఒక్కో పోరాట ఘట్టానికి సంబంధించి ఆ పోరాటంలో పాల్గొన్న వీరుల రాతపూర్వక కథనాలు, ఆడియో కథనాలు, వీడియో కథనాలు, కొందరు పోరాట యోధులు రచించిన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. మన అదృష్టంకొద్దీ ఇంకా పలువురు పోరాట యోధులు బతికి ఉన్నారు కాబట్టి వారి కథనాలను కొత్తగా రికార్డు చేయవచ్చు. ఇలాంటి కథనాలు ఆయా పోరాట ఘట్టాలకు సంబంధించిన సాధికారిక సమాచారాన్నివ్వడం మాత్రమే కాకుండా వీక్షకులకు స్ఫూర్తినిస్తాయి. ఇప్పటికే అమరజ్యోతి భవనంలో ఉన్న గ్రంథాలయాన్ని ఈ కోణంలో అభివృద్ధి చేయాలి. గత శతాబ్దన్నర కాలంలో ఆయా తెలంగాణ పోరాట ఘట్టాలను పలువురు కవిగాయకులు గానం చేశారు, గాథలుగా ప్రదర్శించారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది పోరాట వారసత్వ సంస్కృతి. ఇది ఇలాగే కొనసాగి భావి తరాలకు స్ఫూర్తినివ్వాలంటే ఆయా గాథలను సేకరించి, భద్రపరిచి, ఆసక్తి గలవారికి అందుబాటులో ఉంచాలి. అదే విధంగా తెలంగాణలో జరిగిన కొన్ని పోరాటాలు దేశ పోరాట చరిత్రలోనూ, మరికొన్ని ప్రపంచ పోరాట చరిత్రలోనే అరుదైనవి. వాటిపై విషయ నిపుణులు గ్రంథాలు రచించారు. వాటిని కూడా పరిశోధకులకు, విద్యార్థులకు, సందర్శకులకు అందుబాటులో ఉంచాలి. ఈ నాలుగు కోణాల్లోనూ నాలుగు రకాలైన కృషి శాస్త్రీయంగా, సమగ్రంగా జరగడానికి విషయ నిపుణులతో ఒక సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ ఆయా పోరాట ఘట్టాలు జరిగిన ప్రదేశాలను సందర్శించాలి. పోరాట యోధుల ఫోటోలను, స్మారకాలను, రచనలను, ఆడియో–వీడియో క్లిప్పులను సేకరించాలి. అవసరమైనచోటల్లా ఖాళీలను పూరించే షూటింగులు చేయించాలి. అధునాతన టెక్నాలజీలను వాడాలి. చివరిగా అమరజ్యోతి భవనాన్ని సందర్శించినవారు చిన్న కాగితం మీద ఉండే బార్ కోడ్, క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోనుల్లో ఫోటో తీసుకుని తెలంగాణ అమరుల త్యాగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని అప్పటికప్పుడే పొందేలా ఏర్పాట్లు చేయాలి. విషయ నిపుణుల సెర్చ్ కమిటీని స్టేట్ ఆర్కైవ్స్, పురావస్తు శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం, సాంస్కృతిక శాఖ తదితర సంస్థల భాగస్వామ్యంతో గాని, లేదా ఏదో ఒక సంస్థ సమగ్ర పర్యవేక్షణలో గాని నియమించవచ్చు. లేదా ఒక స్వతంత్ర సెర్చ్ కమిటీని కూడా నియమించవచ్చు. ఈ ప్రయత్నం అనుకున్నట్టు జరిగితే తెలంగాణ భావి తరాలు తమ పోరాట వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమకు తాము మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రజలకు కూడా ఆదర్శప్రాయంగా నిలబడగలుగుతారు.



డాక్టర్ జెబి రాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ కటికల శివ భాగ్యారావు ప్రోత్సాహం తో పుస్తకం లేకపోతే చదువు ఆగకూడదు అన్న నినాదం స్ఫూర్తి గా డాక్టర్ ఓబూరి నాగేశ్వరరావు సహకారంతో ఎన్. ఎస్తేర్ అనే చిన్నారికి 4,750 రూపాయల విలువైన పుస్తకాలు అందజేసిన కునుమ కమలారత్నం మెమోరియల్ ట్రస్ట్ అధినేత లయన్ డాక్టర్ కుసుమ భోగరాజు

## ఈనెల 15 న ఓబీసీ సమస్యలపై జాతీయ స్థాయి కన్వెన్షన్ : ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి):కేంద్రం తక్షణమే కుల గణనను నిర్వహించాలని, ఓబీసీ సమస్యలపై జాతీయ స్థాయి కన్వెన్షన్ ను ఈ నెల 15 న రవీంద్రభారతి లో నిర్వహించనున్నట్లు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. కిరణ్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కన్వెన్షన్ కు ఢిల్లీ నుంచి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ , ఇతర కేంద్ర విశ్వవిద్యాలయాల నుండి ఐఐటీలు, ఎన్ఐటి ల నుండి విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కన్వెన్షన్ కు ముఖ్య అతిథిగా డిఎంకె పార్టీ పార్లమెంట్ సభ్యుడు పీ.విల్సన్ , తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ , రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య , వద్దిరాజు రవిచంద్ర తమిళనాడు నుండి ఓబిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ కరుణానిధి పాల్గొంటున్నారని తెలియజేశారు. బీపీ మండల్ మనవడైన ప్రొఫెసర్ సూరజ్ మండల్, హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం నుండి ప్రొఫెసర్లు పిల్లలమర్రి రాములు, ఈ. వెంకటేష్, బెనారస్ హిందూ యూనివర్సిటీ నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజయ్య తోపాటు గుజరాత్ ఓబీసీ పరిషత్ అధ్యక్షుడు గడావి, మధ్యప్రదేశ్ నుండి ఓబీసీ మహాసభ అధ్యక్షులు విజయకుమార్ పాల్గొంటున్నారని కిరణ్ కుమార్ తెలియజేశారు. ఈ జాతీయ కన్వెన్షన్ లో హైదరాబాద్ డిక్లరేషన్ కూడా రిలీజ్ చేయబోతున్నామని అన్నారు. ఈ సమావేశంలో నేషనల్ కన్వెన్షన్ పోస్టర్ ను ప్రముఖ సామాజిక కార్యకర్త లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ అధ్యక్షుడు డాక్టర్ హరి ఎప్పన్పల్లి, పిడికిలి రాజు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ బిసి అసోసియేషన్ అధ్యక్షుడు బాల శ్రీనివాస్ , సోషల్ జస్టిస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ కె.వి గౌడ్, ప్రముఖ జర్నలిస్టు భద్రతో పాటు ఏఐఓబిసిఎస్ ఐ సభ్యులు అరుణ్ కేతన్, కొండల్, సాయి కిరణ్, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.160 పెరిగిన టమాట

భోపాల్, జూలై 3, :దేశంలోని పలు ప్రాంతాల్లో టమాటా ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే చాలా చోట్లు కిలో టమాటా ధర రూ.100 దాటింది. అయితే మధ్యప్రదేశ్‌లోని రైజెన్ అనే జిల్లాలో టమాటా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అక్కడ కిలో టమాటా ధర ఏకంగా 160 రూపాయలు పలుకుతోంది. దీనివల్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా గృహిణులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మధ్యప్రదేశ్ ఇంకా వేరే చోట్లు కిలో టమాటా ధరలు భిన్నంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో కిలో టమాటా ధర రూ.120 నుంచి రూ.150 మధ్య ఉంది. టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో రైజెన్ జిల్లా కలెక్టర్ అరవింద్ దూబే కీలక వ్యాఖ్యలు చేశారు. టమాటాలకు కొరత ఏర్పడటం వల్లే ధరలు పెరిగాయన్నారు. ఏవైనా కూరగాయలకు డిమాండ్ తక్కువగా ఉండి, ఉత్పత్తి ఎక్కువగా ఉంటే ధరలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం టమాటా సరఫరా తగ్గిపోవడంతో.. ధరలు పెరిగాయన్నారు. టమాటా ధరలు పెరగడం ఒక్క ఈ జిల్లాలోనే కాదు.. దేశ వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉందని గుర్తు చేశారు. మరోవైపు టమాటా ధరలు పెరగడానికి దళారులే కారణమని రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. దళారులు తమ వద్ద కిలో రూ. 20కి కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బాలికలకు 16 ఏళ్ల నుంచేశృంగారం

భోపాల్, జూలై 3, :మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సామాజిక మాధ్యమాల యుగంలో బాలబాలికలకు 14 ఏళ్లకే యుక్త వయసు వస్తుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో బాలికలకు శృంగారానికి సమ్మతి తెలిపే వయసును 18 నుంచి 16 తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతో బాలురను చట్టపరమైన చర్యల నుంచి కాపాడొచ్చని తెలిపింది. అయితే 2020లో ఓ బాలికను పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేశాడంటూ ఓ యువకుడిపై గతంలో ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఇప్పుడు తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టు గ్వాలియర్ ధర్మాసనం జూన్ 27 న ఈ కేసును కొట్టివేసింది. ఇక వివరాల్లోకి వెళ్తే ఆ బాలిక ఓ వ్యక్తి వద్ద ట్యూషన్ చెప్పించుకునేది. అతను ఓ రోజు మత్తు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చి తనను అత్యాచారం చేసి వీడియో కూడా తీశాడని ఆ బాలిక తెలిపింది.అలాగే దాన్ని చూపించి బెదిరిస్తూ తనను లొంగదీసుకున్నాడని ఆరోపించింది. ఈ ఘటన జరిగిన తర్వాత ఆ బాలికకు మరో సన్నిహిత బంధువుతో కూడా శారీరక సంబంధం ఉన్నట్లు హైకోర్టు తెలిపింది. ఇంటర్నెట్ వల్ల బాలబాలికలకు 14 ఏళ్లకే పెద్దరికం వస్తోందని.. హైకోర్టు న్యాయమూర్తి దీపక్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

## మోడీ మీటింగ్ వేళ....

# సర్దుమణిగినట్టేనా..?



హైదరాబాద్, జూలై 3, :తెలంగాణ బీజేపీలో నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. కొంత కాలంగా ఆ నాయకులు అస్సలు కలుసుకోవడం లేదు. అంతర్గత కుమ్ములాటలు తీవ్రస్థాయిలో ఉండటంతో డైరెక్ట్‌గా అధిష్ఠానమే రంగంలోకి దిగి సమస్య పరిష్కారానికి కృషి చేస్తోంది. మరి ఎడమొహం, పెడమొహంగా ఉన్న ఈ నేతలు ఇవాళ కలుసుకోబోతున్నారా? బీజేపీలో రెండు వర్గాలుగా చీలిపోయిన ఈటెల, బండి సంజయ్ కలుస్తున్న వేదిక ఏంటి? కొంతకాలంగా తెలంగాణ బీజేపీ నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నాయి. పార్టీ నేతలు రెండుగా చీలిపోయి బండి సంజయ్ అనుకూల వర్గంగా, వ్యతిరేకవర్గంగా తయారైంది. బండి సంజయ్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఈటల రాజేందర్ మరో గ్రూప్‌కు నాయకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు నేతల మధ్య మిగతా నాయకులు కూడా చీలిపోయారు. ఇటీవల కాలంలో బండిసంజయ్, ఈటల రాజేందర్ ఇద్దరూ కూడా ఎదురెదురు పడలేదు.కొద్దికాలంగా ఈటల రాజేందర్ పార్టీకి సంబంధించిన ముఖ్య కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అంతేకాదు ఈటల అసంతృప్తిగా ఉన్నారని తెలిసి పార్టీ అధినాయకత్వం ఢిల్లీకి పిలిపించుకుని మాట్లాడారు. ఈ సమయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభ జరగడంతో ఈ వేదికలో కూడా ఇద్దరు నేతలు కలవలేదు. అయితే ఇప్పుడు నాయకత్వ మార్పుపై బీజేపీలో విస్తృతంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఇద్దరు నాయకులపై అందరి దృష్టి పడింది.ఈనెల 8వ తేదీన వరంగల్‌లో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ ఉంది. బీజేపీ ముఖ్యనాయకులంతా సభ ఏర్పాటు పరిశీలన కోసం వరంగల్ వెళ్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సన్నాహక సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎదురెదురు పడబోతున్నారుఇద్దరు నేతలు ఎదురైతే ఎలా ఉంటుందో చూడాలని కాషాయ కార్యకర్తలతోపాటు మిగతా పార్టీల నేతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక కొత్త అధ్యక్షుడిగా పేరు వినిపిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా సన్నాహక సమావేశానికి హాజరవుతున్నారు. ఈ ముగ్గురు నాయకుల కలయిక ఆసక్తిగా మారింది. ఇవాళ హన్మకొండలో జరిగే కార్యక్రమానికి పెద్దయెత్తున బీజేపీ కార్యకర్తలు విచ్చేస్తున్నారు. విభేదాల కాషాయంలో ఏమి జరుగుతుందో చూడాలి మరి.

## పిల్లనగ్రోవి స్థానంలో కత్తి...

ఖమ్మం, జూలై 3, :విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు శతజయంతి సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో లకారం ట్యాంక్‌బండ్ వద్ద శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న అన్నగారి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని వాస్తవంగా మే 28.. అయన జయంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ చేత ఆవిష్కరింప చేయాలని నిర్వాహకులు భావించారు. బేస్‌మెంట్‌తో కలిసి 54 అడుగులు ఎత్తు ఉన్న ఈ విగ్రహం తల భాగం అయిదు అడుగులు, కాళ్ల భాగం అయిదు అడుగులు, ఇంకా మొత్తం శరీర భాగం ఎత్తు 45 అడుగులు గా రూపొందించారు. తానా అసోసియేషన్‌తోపాటు పలువురు ప్రముఖుల సహకారంతో దాదాపు 4 కోట్ల రూపాయిల వ్యయంతో రూపుదిద్దుకున్న ఈ విగ్రహాన్ని హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో బుద్ధుడి విగ్రహం వలే.. ఏర్పాటు చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్ విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను అప్పట్లో స్వయంగా పర్యవేక్షించారు. పెద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం కోసం.. జూనియర్ ఎన్టీఆర్ వస్తుండడం పట్ల అప్పట్లో ఆయన ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఎన్టీఆర్ విగ్రహం శ్రీకృష్ణుడి రూపంలో ఉండడంపై పలు యాదవ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకెక్కాయి.దీంతో తెలంగాణ హైకోర్టు తొలుత విగ్రహం ఏర్పాటుపై స్టే ఇచ్చి, ఆ తరువాత శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు నో చెప్పింది. దీంతో కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహంలో పలు మార్పులు చేయడానికి నిర్వాహకులు ఉపక్రమించారు. ఎన్టీఆర్ విగ్రహం చేతిలో ఉన్న పిల్లన గ్రోవిని తొలగించారు. పింఛం కూడా తీసేశారు. పిల్లనగ్రోవి స్థానంలో ఖడ్గాన్ని చేర్చారు. అలాగే కిరీటం, నెమలి పింఛం, విష్ణు చక్రం తొలగించినట్లు తెలుస్తోంది. లకారం చెరువుపై విగ్రహావిష్కరణకు హైకోర్టు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రైవేట్ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విగ్రహావిష్కరణ ఆగస్టులో జరిగే అవకాశాలున్నాయని అంటున్నారు.

## బీఆర్ఎస్ లో అసంతృప్తులు గళం

హైదరాబాద్, జూన్ 3, :అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీఆర్ఎస్ లో అసంతృప్తులు గళం వినిపిస్తున్నారు. తాజాగా తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత సామేల్ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు రేసు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. ముందుగానే 70 నుంచి 80 మంది అభ్యర్థులను కూడా ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో...పలువురు నేతలు అలర్ట్ అవుతున్నారు. సీటుపై తేడా కొడితే చాలు...హైకమాండ్ కు హింట్ ఇచ్చేస్తున్నారు. ఇక అధికార బీఆర్ఎస్ లో చూస్తే...ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తోంది. ఇప్పటికే పొంగులేటి, జూపల్లితో పాటు పలువురు నేతలు కారు దిగగా... మరికొందరు కూడా అదే బాటలో వెళ్లేందుకు యోచిస్తున్నారు. ఇప్పటికే తీగల వంటి నేతలు హైకమాండ్ అల్టిమేటం ఇవ్వగా... సూర్యాపేట జిల్లాకు చెందిన సీనియర్ నేత సామేల్ పార్టీని వీడనున్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందిసూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ లీడర్, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ పార్టీ వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన... బీఆర్ఎస్ లో మాదిగలకు తీవ్రని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కనీసం మాదిగ సామాజికవర్గానికి చెందిన ఒక్కరు కూడా మంత్రిగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల సమస్యలు చెప్పుకునే అవకాశం లేదన్నారు. మాదిగలు మెజారిటీ ఉన్న ప్రాంతాల్లో కూడా మాదిగలకు గుర్తింపు లేదన్నారు. ఎవరు జెండా మోయని నాడు తాను జెండా మోసి పార్టీని నిలబెట్టానని చెప్పుకొచ్చారు. తుంగతుర్తిలో తనకు పోటీగా వలస మాలను నిలబెట్టారని ఫైర్ అయ్యారు. మంత్రి కేటీఆర్ తుంగతుర్తి నియోజకవర్గంలో పర్యటించారు. ప్రగతి నివేదన సభ వేదికగా... తుంగతుర్తి ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను మూడో సారి గెలిపించాలని కోరారు. ఫలితంగా తుంగతుర్తి టికెట్ గాదరి కిషోర్‌కే అనే విషయాన్ని పరోక్షంగా చెప్పినట్లు అయింది. ఇది కాస్త సామేల్ కు మింగుడు పడటం లేదు. 2014, 2018లో టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన...ఈసారి వస్తుందని భావించారు. కేటీఆర్ ప్రకటనతో ఈ సారి కూడా తుంగతుర్తి టికెట్ తనకు దక్కేలా లేదని భావించాడు. అందుకే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వేరే పార్టీ టికెట్‌పై బరిలోకి దిగాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఆయన కాంగ్రెస్ లోకి వెళ్తారా లేదా బీఎస్పీలోకి వెళ్తారా అన్న చర్చ కూడా జరుగుతుంది.

## కాంగ్రెస్‌లో ఐక్యత - బీజేపీలో ముసలం !

హైదరాబాద్, జూన్ 3, : కాంగ్రెస్ అంటే అంతర్గత రాజకీయాల పుట్ట. ఆ పార్టీ నేతలు తాము ఎవరిని ఓడించాలన్నదాన్ని సంగతిని ఎప్పుడూ పట్టించుకోరు. తమలో తాము ఎవర్ని ఓడించాలా అని ఆలోచిస్తూ ఉంటారు. అదే బీజేపీ అయితే.. ముందుగా పార్టీ గెలుపు కోసం ప్రయత్నిస్తారు. తర్వాత హైకమాండ్ ఎవరికి పదవి ఇస్తే వారు తీసుకుంటారు. ఇదంతా తెలంగాణ విషయంలో రివర్స్ అయిపోయింది. నిన్నటిదాకా కాంగ్రెస్ పార్టీ తన సహజ లక్షణాలను బహిరంగంగానే బయట పెట్టుకుంది .. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ఐక్యంగాకనిపిస్తోంది. బీజేపీ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడటం లేదు. రేవంత్ రెడ్డికి పీసీసీ చీఫ్ పదవి ఇచ్చిన తర్వాత చాలా మంది సీనియర్లు తాము ఆయన కింద పని చేయడం ఏమిటని ఫీలయ్యారు. రేవంత్ స్వయంగా వెళ్లి మాట్లాడినా చాలా మంది సర్దుకోలేదు. కానీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసింది మాత్రం ఎక్కువగా జగ్గారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రమే. తర్వాత ఉత్తమ్ కమార్ రెడ్డి తనపై కాంగ్రెస్ నేతలే దష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపణలు చేశారు. కర్ణాటక ఫలితాల తర్వాత ఏర్పడిన వాతావరణం.. డీకే శివకుమార్, ప్రియాంకా గాంధీ బాధ్యతలు తీసుకోవడంతో ఎలాగైనా గెలిపించి పెడతారన్న నమ్మకానికి వస్తున్నారు. మజ్లిస్ పార్టీ కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్న సంకేతాలు.. తెలంగాణలో ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఎక్కువగా ఉందన్న అంచనాలతో అంతా సైలెంట్ అయిపోయారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తోంది. రేవంత్ రెడ్డి ఒక్కరే కాదని.. పార్టీ అంటే అందరూ ఉంటారని..కానీ ఆయన నాయకత్వ స్తానంలో ఉన్నారు కాబట్టి ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచిస్తున్నారు. ధిక్కరిస్తే మాత్రం వెటేనని సంకేతాలిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇలా చాలా సార్లు చెప్పింది కానీ ఎప్పుడూ చేయలేదు. కానీ ఇప్పుడు మాత్రం కత్తి నూరడం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో బీజేపీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేని స్థితికి వెళ్లిపోయింది. అయితే బీజేపీలో ఇంకా బహిరంగ విమర్శలు ప్రారంభం కాలేదు. అలాంటివి ప్రారంభమైతే.. ఆ పార్టీ పరిస్థితి తెలంగాణలో మరింత దిగజారిపోతుంది. రాజకీయాల్లో ఏదైనా గెలుపు ఆశలే పార్టని నిలబెడతాయి. ఇంత కాలం కాంగ్రెస్ కు చాన్స్ లేదని అనుకున్నారు .అందుకే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అయింది. కానీ ఇప్పుడు గెలిచే పార్టీ అనే పరిస్థితి రావడంతో అందరూ సైలెంట్ అయిపోయారు. సర్దుకుపోతున్నారు. కానీ వెనుకబడిపోతుందని భావిస్తున్న బీజేపీలో మాత్రం లుకలుకలు పెరిగిపోతున్నాయి.ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ తర్వాత కాంగ్రెస్ మరింత పుంజుకుంటుందనే వాదన వినిపిస్తున్నారు. పెద్ద ఎత్తున జన సమీకరణ చేయబోతున్నారు. సభను విజయవంతం చేసి.. కర్ణాటక తరహాలో పతకాలకు గ్యారంటీలు ఇవ్వాలని అనుకుంటున్నారు. ఖమ్మం సభ తర్వాత జూపల్లి మహబూబ్ నగర్‌లో సభ నిర్వహించనున్నారు. దానికీ రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. ఇలా వరుస సభలతో దూసుకెళ్తామని.. ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ నేతలు నమ్మకానికి వస్తున్నారు.

## 9 వేలకు చేరిన పసుపు ధర

నిజామాబాద్, జూన్ 3, : గత సీజన్ లో కురిసిన భారీ వర్షాలకు పసుపు రైతులకు సరైన ధర, దిగుబడి లేక రైతులు తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొన్నారు. కాగా, పసుపునకు ఇప్పుడిప్పుడే మంచి ధర పలుకుతోంది. గత వారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు ధర రూ.9,269 రూపాయలు పలికింది. స్పైస్ బోర్డ్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఈ సీజన్ లో ధర తక్కువగా కారణంగా రైతులు కోల్డ్ స్టోరేజ్లలో నిల్వ చేసుకున్నారు.ఇప్పుడిప్పుడే పసుపు ధరలు కొంత మేరకు ఆశాజనకంగా ఉండడంతో రైతులు పసుపు కొమ్ములు అమ్మేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు. ఏర్గట్ల మండలం దోంచందా, జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నంకు చెందిన రైతుల పసుపునకు రూ.9,200 నుంచి రూ.9,300 వరకు ధర పలికింది. దీంతో కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేసుకొని ఇప్పుడు అమ్ముకున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అటు వ్యాపారస్తులు కూడా ప్రస్తుతం రేట్లు ఆశాజనకంగా ఉన్నాయని, మేలైన పసుపు ఉంటే రూ.10వేల ధరకు కూడా కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు. శుక్రవారం మోడల్ ధర రూ.6,605 ఉండగా తక్కువగా రూ.4,600కు అమ్ముడుపోయిన పసుపు అత్యధికంగా రూ.9,599 విక్రయించినట్లు వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. శుక్రవారం కాడి రకం 1,855 క్వింటాళ్ల పసుపు మార్కెట్ కు వచ్చిందని తెలిపారు. గోల రకం 839 క్వింటాళ్లు రాగా దాని మోడల్ ధర రూ.6,400గా నిర్ణయించారు.అత్యల్పంగా రూ.5 వేలకు, అత్యధికంగా రూ.7,939కి విక్రయించినట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత నిలువ ఉన్న రకానికి మంచి ధర వస్తుందని ఈ సీజన్ లో ఇదే అత్యధిక ధర అని అధికారులు తెలిపారు. రైతులు మంచి ధర కోసం ఎదురు చూసి అన్ సీజన్ లో అమ్ముకుంటున్న వారికి కాసుల వర్షం కురుస్తుందనే చెప్పాలి.

## తెలుగులో తీర్పులివ్వండి

**న్యాయమూర్తులను కోరిన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు**

మున్సిఫ్ కోర్టు, సబ్ కోర్ట్ ,జిల్లా కోర్టులలో తెలుగులోనే తీర్పులు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వవలసిందిగా హైకోర్టు న్యాయమూర్తులు టి నవీన్ రావ్, నగేష్ భీమపాకలను తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ కోరారు. సోమవారం నాడు హైకోర్టులో జస్టిస్ నవీన్ రావు కార్యాలయంలో "తెలుగులో తొలి తీర్పు " అన్న పుస్తకాన్ని న్యాయమూర్తులు నవీన్ రావు,భీమపాక నగేష్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ హైకోర్టులో తొలిసారిగా తెలుగులో తీర్పు ఇవ్వడాన్ని సమస్త తెలంగాణ సమాజం స్వాగతిస్తోందని తెలిపారు. కిందికోర్టు నుంచి జిల్లా స్థాయి కోర్టువరకు తీర్పులన్నీ తెలుగులోనే ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. తెలుగులో తీర్పులను ఇవ్వడం వల్ల ప్రజలకు న్యాయశాస్త్రం పై అపారమైన నమ్మకం కలుగుతుందన్నారు. హైకోర్టులో ఇచ్చిన విధంగానే మున్సిఫ్ కోర్టు, సబ్ కోర్టు, జిల్లా స్థాయి అన్ని కోర్టులలో తీర్పులు తెలుగులో వెలువడుటకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తెలుగులో తీర్పునివ్వడం వల్ల అమ్మ భాషను గౌరవించి తెలుగు సంస్కృతిని సత్కరించినట్లు అయ్యిందన్నారు. తెలుగులో తీర్పులు వస్తేనే కోర్టులు ప్రజలకు మరింత దగ్గరైతాయని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు తొలిసారిగా తెలుగులో తీర్పునివ్వడం.చారిత్రాత్మక విషయం గా మిగిలిపోతుందని చెప్పారు.తెలుగు లో తీర్పునిచ్చిపప్పటికినీ ఇంగ్లీషు ప్రతికూడ ఉంటుంది కాబట్టి దీనికెవరు అభ్యంతరం చెప్పవలిసిన అవసరం ఉండదన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్ రావు జస్టిస్ నగేష్ భీమపాకలను జూలూరు శాలువాలతో సన్మానించారు.

# హైదరాబాద్‌కు అఖిలేష్..

(మొదటి పేజీ తరువాయి)



పాట్నా భేటీలో యాక్టివ్‌గా వున్న మరాఠా యోధుడు, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ ఇపుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్రలో జరిగిన రాజకీయపరమైన మార్పులు ఆయన అనుమతితో జరిగాయా ? లేక ఆయన్ను పక్కన పెట్టి ఎన్సీపీ నేతలే చక్రం తిప్పారా అన్నది ఇదమిత్థంగా తేలనప్పటికి.. ఇపుడు విపక్షాల కూటమిలో శరద్ పవార్ రోల్ తాత్కాలికంగానైనా ముగిసినట్లే భావించాలి. జులై 17, 18 తేదీలలో బెంగళూరు వేదికగా విపక్షాల రెండో భేటీ జరగబోతోంది. మొదటి భేటీలో పాల్గొన్న పార్టీలలో రెండు పార్టీలు ఈ భేటీకి హాజరయ్యే అంశం ఇపుడు సందేహంలో పడింది. నిజానికి మొదటి భేటీలో ఢిల్లీ ఆర్డినెన్సుకు మద్దతు కూడగట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నించింది. మిగిలిన పార్టీలు మద్దతుకు ముందుకు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఎటూ తేల్చలేదు. ఎందుకంటే ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో వున్న ఢిల్లీ, పంజాబ్‌లలో తమను దారుణంగా దెబ్బకొట్టిన అరవింద్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ అగ్రనేతలు గుర్రుగా వుండడమే అందుకు కారణం. ఢిల్లీ ఆర్డినెన్సుపై కాంగ్రెస్ పార్టీ మద్దతివ్వకపోవడంతో పాట్నా భేటీ అనంతరం జరిగిన మీడియా మీట్‌లో కేజ్రీవాల్ పాల్గొనకుండానే వెళ్ళిపోయారు. అనాటి నుంచి కేజ్రీవాల్ విపక్షాల కొత్త కూటమికి దూరంగానే వున్నారు. ఈక్రమంలో బెంగళూరు భేటీకి ఆమ్ ఆద్మీ పార్టీ గైర్హాజరయ్యే అవకాశాలే ఎక్కువ. ఇక మహారాష్ట్రలో జులై 2 నాటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్సీపీకి చెందిన మెజారిటీ వర్గం ఇపుడు ఎన్డీయే కూటమికి దగ్గరయ్యింది. ఏకంగా బీజేపీ, శివసేనతో కలిసి మహారాష్ట్రలో అధికార కూటమిలో కొనసాగుతోంది. ఇపుడు శరద్ పవార్ దగ్గర ఎన్సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎందరున్నారంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. తన సొంతింటినే కాపాడుకోలేని శరద్ పవార్ బెంగళూరు భేటీకి హాజరవడం సందేహమే. ఈ లెక్కన పాట్నా భేటీలో మొత్తం పదిహేడు పార్టీలుంటే.. బెంగళూరుకు వచ్చేసరికి అది 15కో లేక బీజేపీ బీహార్ ఆపరేషన్ కూడా పూర్తయితే 14కో పడిపోయే అవకాశాలున్నాయి. మహారాష్ట్ర మాదిరిగానే బీహార్‌లో నితీశ్ పార్టీని నిట్టనిలువునా చీల్చేందుకు భారతీయ జనతా పార్టీ ఆపరేషన్ ప్రారంభించినట్లు కథనాలు వస్తున్నాయి. బీజేపీ వ్యూహం వర్కౌట్ అయితే, పదిహేను రోజుల్లో పరిస్థితి మారిపోవచ్చు. నితీశ్ పార్టీ నుంచి పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు చీలిపోయి వేరు కుంపటి పెట్టుకుని బీజేపీ మద్దతుతో అక్కడ అధికారం చేపడితే నైతికంగా నితీశ్ కుమార్‌కు భారీ దెబ్బ తగలొచ్చు. అదే జరిగితే ఇప్పటి దాకా విపక్షాలను ఒక జట్టుగా చేరుస్తున్న నితీశ్ ఆ రోల్‌లో కొనసాగలేరు. బహుశా ఈ పరిణామాలను ఊహించినందువల్లనే విపక్షాల రెండో భేటీ నిర్వహణ బాధ్యతలను కాంగ్రెస్ అధినాయకత్వం చేపట్టింది. ఇలాంటి కీలకతరుణంలో అఖిలేశ్ యాదవ్ హైదరాబాద్ వచ్చి కేసీఆర్‌ని కల్వడం దేనికి ? ఇది లోతుగా ఆలోచిస్తే గానీ తేలని అంశం. ఓ వ్యూహం ప్రకారం చూస్తే కేసీఆర్, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దాకా ఓ పంథాలోను, ఆ తర్వాత ఫలితాలను బట్టి మరో పంథాను ఎంచుకోవచ్చు. కేసీఆర్ తెలంగాణలో మూడోసారి కూడా సొంతంగా అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీకి దూరంగానే వుంటారు. సార్వత్రిక ఎన్నికల దాకా బీజేపీతో అంటీముట్టనట్లుంటారు. ఒకవేళ తెలంగాణలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పోలరైజ్ అయి, కాంగ్రెస్ పార్టీకి గంపగుత్తగా పడితే మాత్రం పరిస్థితి వేరుగా వుంటుంది. ఏ పార్టీకి మెజారిటీ రాకపోతే మాత్రం కాంగ్రెస్, కేసీఆర్ కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. ఇదంతా ఊహాజనితంగా అనిపించినా రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చన్నది గుర్తు పెట్టుకోవాల్సిందే. బీజేపీనే ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్, కేసీఆర్ భావిస్తే మాత్రం తెలంగాణ ఎన్నికల తర్వాత రెండు పార్టీలు కలిసి పని చేయడం ఖాయం. బహుశా ఆ ముందస్తు వ్యూహంతోనే కాంగ్రెస్ దూతగా అఖిలేశ్ హైదరాబాద్ పర్యటనకు వచ్చి వుంటారన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# ఇదే ఫైనల్ !

(మొదటి పేజీ తరువాయి)

2014 రాష్ట్ర పునర్విభజన అనంతరం కేంద్ర జలశక్తి సమక్షంలో రెండు రాష్ట్రాల మధ్య రాతపూర్వక ఒప్పందాలు కూడా కుదిరాయి. తెలంగాణ మాత్రం ఆ ఒప్పందాలను తిరగోడాలనీ, కృష్ణా జలాలను 50:50 శాతం ప్రాతిపదికన పున:పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తోంది. పున:పంపిణీ కోసం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కూడా వాదిస్తోంది. ఈ మేరకు కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు హామీతో గతంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నప్పటికీ పున:పంపిణీ చేసి తీరాలని పట్టుబడుతోంది. తెలంగాణ వాదనపై సమగ్ర అధ్యయనం చేయటమే కాకుండా న్యాయ నిపుణులతో చర్చించిన కేంద్ర జలశక్తి పున:పంపిణీ సాధ్యం కాదని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్టు- సమాచారం. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ -1 (కేడ డబ్ల్యుడీటీ - బచావత్ ట్రిబ్యునల్) అవార్డును అనుసరించి 66:34 శాతం మేరకే కేటాయింపులుంటాయని కేంద్ర జలశక్తి కృష్ణా బోర్డుకు స్పష్టం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అదనపు జలాల కోసమే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాలు సుప్రీంకోర్టు డిక్రీతో సమానం.. అందువల్లనే బచావత్ తరువాత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వచ్చినా పాత్ర ట్రిబ్యునల్ ఆదేశాలను తిరగదోడలేదని ఏపీ గుర్తు చేస్తోంది. అంతర్ రాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్ఆర్డబ్ల్యూడీ) 1956 చట్టంలోని సెక్షన్6 (2) ప్రకారం కొత్త ట్రిబ్యునళ్ళు పాత ట్రిబ్యునల్ ఆదేశాలను పున:సమీక్షించటానికి ఏర్పడవు. అపరిష్కృతంగా ఉన్న వివాదాల పరిష్కారం, కొత్తగా అందుబాటులోకి వచ్చిన జలాలను పంపిణీ చేయటానికే కొత్త ట్రిబ్యునళ్ళు పనిచేస్తాయి.. అందువల్లనే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కేవలం కృష్ణాలో 65 శాతం నీటి లభ్యత ఆధారంగా అదనంగా అందుబాటులోకి వచ్చే 163 టీ-ఎంసీలు, వరదల సమయంలో ఒనగూరే 285 టీఎసీంసీల మిగులు జలాలు.. మొత్తం 448 టీఎంసీలను ఏపీ, తెలంగాణ, కర్ణాటకలకు పంచే విషయానికే పరిమితమైందని నిపుణులు చెబుతున్నారు. చట్ట ప్రకారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కేవలం బచావత్ పంపిణీ చేసిన 811 టీఎంసీలకు అదనంగా కొత్తగా నీటి లభ్యతను గుర్తిస్తే ఆ జలాలను పంపిణీ చేయటానికి మాత్రమేపరిమితమవుతుంది.. కొత్తగా నీటి లభ్యతను గుర్తించినందు వల్లనే విభజన చట్టంలోని 11వ షెడ్యూల్ లో ఏపీలో అదనంగా నాలుగు ప్రాజెక్టులకూ, తెలంగాణలోని రెండు ప్రాజెక్టులకు కృష్ణా జలాలను కేటాయించారు. ఏపీలో తెలుగుగంగ విస్తరణకు 29, గాలేరు-నగరి ప్రాజెక్టుకు 38, హంద్రీనీవాకు 40, వెలిగొండ కు 43.50 టీఎంసీలు.. మొత్తం 150.50 టీఎంసీలు కేటాయించారు. తెలంగాణలోని కల్వకుర్తికి 25, నెట్టెంపాడుకు 22 టీఎంసీలు.. మొత్తం 47 టీఎంసీలు కేటాయించారు. దీనిపై తెలంగాణకు స్పష్టత ఉన్నా వివాదం రగలించటం ద్వారా కృష్ణా జలాల్లో అదనపు ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తోందని ఏపీలోని నీటిపారుదల నిపుణులు భావిస్తున్నారు.

**కొత్త ట్రిబ్యునల్ కావాలి**

రాష్ట్ర పునర్విభజన తరువాత రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు ఒక ఏడాదికి మాత్రమే పరిమితమని తెలంగాణ వాదిస్తోంది. 50:50 శాతం కృష్ణా జలాల పున:పంపిణీ కోసం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. శ్రీశైలం నుంచి 34 టీఎంసీలకు మించి వినియోగించుకునేందుకు ఏపీకి హక్కులు లేవు.. అయినా శ్రీశైలం జలాలను కృష్ణా బేసిన్ అవతలకు ఏపీ తరలిస్తోంది.. ఉమ్మడి రాష్ట్రాలకు కేటాయించిన కృష్ణా జలాల్లో 20 శాతం తాగునీటి అవసరాల కోసం కేటాయించాలని బచావత్ ట్రిబ్యునల్ చెప్పినా అమలు కావటం లేదు.. నిబంధనల ప్రకారం ఒక ఏడాదిలో కేటాయించిన జలాల్లో మిగిలిన నీటిని వచ్చే ఏడాదికి క్యారీ ఓవర్ చేయాల్సి ఉంటుంది.. చెన్నై తాగునీటి సరఫరా కోసం 1976,77లో చేసుకున్న ఒప్పందాలకు లోబడి రూల్ కర్వ్ ఖరారు చేయాలి.. శ్రీశైలం, నాగార్జునసాగర్ వద్ద జలవిద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రూల్ కర్వ్ ను సవరణ చేయాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది.

# మంజీరా పై మరో ఎత్తిపోతల ప్రాజెక్టు..

## 30,646 ఎకరాలకు సాగునీరు



హైదరాబాద్, : రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఫలితాలు వస్తున్నా నిరంతర శ్రమతో ప్రతిఎకరానికి సాగునీరు అందించే ప్రయత్నాన్ని వేగవంతం చేసింది. జల వనరులను సద్వినియోగం చేసి కాకతీయుల కాలం నాటి స్వర్ణయుగానికి మించిన అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేస్తోంది. కృష్ణా, గోదావరితో పాటుగా వాటి ఉపనదులపై రిజర్వాయర్ నిర్మిస్తోంది. ప్రతినియోజకవర్గానికి లక్ష ఎకరాల సాగునీరు లక్ష్యంతో బడ్జెట్‌లో నిధులు ప్రకటించి పనుల్లో వేగం పెంచింది. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణలోని గోదావరి ఉపనది మంజీరా పై మరో ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు నిర్మాణంకోసం రాష్ట్ర ప్రభుత్వం అంచనావ్యయాన్ని ఆమోదించి డీపీఆర్‌ను సిద్ధంచేసి భూసేకరణ చేస్తోంది. మంజీర నది ఆనకట్టను బలోపేతం చేసి నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు నిజాంసాగర్ డ్యాం దిగువన మల్లూరు దగ్గర రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూసేకరణ దాదాపుగా పూర్తి కావడంతో ప్రాజెక్టు నిర్మాణం పై ప్రభుత్వం దృష్టి సారించింది. మంజీరానది మహారాష్ట్ర బాలాఘాట్ పర్వత శ్రేణిలో పుట్టి 30వేల 844 చదరపు కిలోమీటర్ల పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ గౌడ్‌గవ్ దగ్గర తెలంగాణలో ప్రవేశించి కందకుర్తి దగ్గర గోదావరిలో మంజీర కలుస్తుంది. దారిపొడుగునా అనేక రిజర్వాయర్లను నింపుతూ తెలంగాణలో వేలాది ఎకరాల సాగుభూమికి, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తున్న మంజీర పై మరో ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నది సంగారెడ్డిలో దిశను మార్చే దగ్గర ఉన్న ప్రాజెక్టుల్లో నీటిని నింపి ముందుకు ప్రవహిస్తుంది. మంజిరా నదిపై ఆనకట్టను బలోపేతం చేసి నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు ప్రభుత్వంవేగంగా పనులు ప్రారంభించింది. ఈ ఎత్తిపోతల పథకంద్వారా 30వేల 646 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు కామారెడ్డి జిల్లాలో పిట్ల, బిచ్కుంద, నిజాంసాగర్ మండలాల్లో కరువు పడిత ప్రాంతాల చిన్న నీటి వరులను ఈ పథకానికి అవసరమైతే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 2.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. ఈ పథకానికి కామారెడ్డి జిల్లా, నిజాంసాగర్ మండలం మల్లూర్ గ్రామం నిజాంసాగర్ డ్యామ్ దిగువ మంజీర నది నుంచి నీటిని ఎత్తిపోయడంకోసం బ్యారేజీ, సాగునీటి పథకానికి ప్రభుత్వం జీవో నం.106 ద్వారా రూ.476 కోట్ల 25 లక్షల పరిపాలనా పరమైన అనుమతులు లభించాయి. భూసేకరణ,తదితర ఇంజనీరింగ్ పనుల కోసం ఇప్పటివరకు రూ.14 కోట్లు ఖర్చు అయింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిపాదిత సామర్థ్యం 40వేల 768 ఎకరాల భూమి సాగులోకి రానుంది. దీంతో పాటుగా నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని గోదావరి ఉపనదులపై రిజర్వాయర్లు, ఎత్తిపోతల ప్రాజెక్టులు నిర్మించి సాగునీటికి నోచుకోని ఎగువప్రాంతాల భూములకు నీరందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను రూపొందిస్తోంది. అయితే నదులు దిగువకు ప్రవహించడంతో ఎగువప్రాంతాలు ఇప్పటివరకు బోర్లు, బావులు, వర్షంపై ఆధార పడిన వ్యవసాయ యోగ్యం గల భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించే కార్యక్రమంలో భాగంగా నాగమడుగు ఎత్తిపోతల పథకాననికి ప్రణాళిక సిద్ధం చేసిన ప్రభుత్వం ఆమేరకు పనుల్లో వేగం పెంచి సంవత్సరంలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ అక్షింతలు

కరీంనగర్, జూలై 2,:కాళేశ్వరం ఎత్తిపోతల ప్రయోజనాలను ఎక్కువ చేసి చూపారని కాగ్ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ లో 46.81 శాతం ఈ ఒక్క ప్రాజెక్టుకే అవసరం అవుతుందని తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై కాగ్ సంచలన నివేదిక ఇచ్చింది. కాళేశ్వరం ప్రయోజనాలు ఎక్కువ చేసి చూపారని కాగ్ తన నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం భారీగా పెరిగిందని తెలిపింది. కేంద్ర జల సంఘం రూ.81,911 కోట్ల డీపీఆర్ కు ఆమోదించిందని, అయితే తాజా అంచనా ప్రకారం రూ.1,49,317 కోట్లుగా మారిందని కాగ్ నివేదికలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ లో 46.81 శాతం ఈ ఒక్క ప్రాజెక్టుకే అవసరమవుతుందని కాగ్ తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏడాదిగా అధ్యయనం చేసి కాగ్ తన తుది నివేదిక ప్రకటించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ముందు తక్కువ చేసి చూపించారని కాగ్ నివేదిక పేర్కొంది. ముందు రెండు టీఎంసీలతో చేపట్టినా ఈ ఎత్తిపోతల పథకాన్ని... ఆ తర్వాత మూడు టీఎంసీలకు పెంచారని, దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.28,151 కోట్లు పెరిగిందని కాగ్ వ్యాఖ్యానించింది. పాత ధరల అంచనాలతో డీపీఆర్ రూపొందించారని, తాజా నిర్మాణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొంటే ప్రతి ఎకరాకు మూలధన వ్యయం రూ.6 లక్షల 50 వేలు అవుతుందని కాగ్ నివేదిక తెలిపింది. ప్రతి ఏడాది విద్యుత్ ఛార్జీలకు రూ.10,374.56 కోట్లు అవసరం అవుతుందని కాగ్ పేర్కొంది. వీటన్నింటినీ లెక్కల్లోకి తీసుకుంటే ఎకరాకు నిర్వహణ ఖర్చు రూ.46,364 అవుతుందని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.87,949 కోట్లు 7.8 శాతం నుంచి 10.9 శాతం వడ్డీతో రాష్ట్ర ప్రభుత్వం రుణంగా తీసుకుందని కాగ్ నివేదికలో వివరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకొన్న రుణాలపై అదనంగా రూ. 8182 కోట్ల వడ్డీ పడింది. తిరిగి చెల్లించే గడువు వాయిదా వేయడంతో అదనపు భారం పడిందని కాగ్ నివేదిక పేర్కొంది. 14 ఏళ్లలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అసలు, వడ్డీ కలిపి రూ. 1,41,544.59 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2015లో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దీంతో 2022 మార్చి వరకు రూ. 87,449.15 కోట్లకు 15 రుణ ఒప్పందాలు చేసుకుంది. ఇందులో నిర్మాణ సమయంలో చెల్లించే వడ్డీ రూ. 11,220.22 కోట్లు ఉందని కాగ్ వర్గాలు తెలిపాయి. 2022 మార్చి వరకు రూ. 64,283.40 కోట్ల రుణాలు ఖర్చు చేశారని కాగ్ తెలిపింది. 15 ఒప్పందాల్లో పదింటికి 2020-21, 2021-22లో తిరిగి చెల్లింపు ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. కాళేశ్వరం కార్పొరేషన్ విజ్ఞప్తితో నాలుగు ఒప్పందాల్లో ఏడాది, 5 ఒప్పందాల్లో రెండేళ్లు వాయిదా వేశాయి బ్యాంకులు. దీంతో అదనపు వడ్డీ రూ. 8182.44 కోట్ల భారం పడుతోందని కాగ్ తాజా నివేదికలో పేర్కొంది.

# కమలంలో అంతర్గత సంక్షోభం

హైదరాబాద్, జూన్ 3,:తెలంగాణ బీజేపీ ఇప్పుడు సంధి దశలో ఉంది. గతంలో పాదయాత్రలని.. మరొకటని జోరుగా ప్రజల్లోకి వెళ్లిన నేతలు ఇప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు.. ట్వీట్లతో కాలక్షేపం చేస్తున్నారు. మా పదవుల్ని తీసేయడం లేదని మీడియాకు వివరణ ఇచ్చేందుకు సమయం వెచ్చిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం జోరు మీద ఉంది. బహిరంగసభలు.. పాదయాత్రలు.. చేరికలతో తీరిక లేకుండా ఉంది. పనైపోయిందన్న కాంగ్రెస్ జోరు మీదకు రావడానికి.. ఊపు మీదుందనుకున్న బీజేపీ వెనుకబడిపోవడానికి కారణం ఎవరు ? ఖచ్చితంగా పార్టీ హైకమాండే. అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాలతో పార్టీ నేతల్ని అయోమయంలోకి నెట్టారు. ఇప్పటికీ అది కొనసాగుతోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీజేపీ అనూహ్యంగా రేసులోకి దూసుకొచ్చింది. దీనికి కారణం ఆయన ప్రధానంగా బీఆర్ఎస్ ను టార్గెట్ చేసుకోవడమే. కేసీఆర్‌పై నిర్మోహమాటంగా ఎటాక్ చేస్తూ.. పాలనా వైఫల్యాలపై చురుగ్గా ప్రజల్లోకి వెళ్లారు. కేసీఆర్ అవినీతిపై గట్టిగా ప్రచారం చేస్తూ జైలుకు పంపిస్తామని పలుమార్లు ప్రకటించారు. కేంద్రంలో అధికారం ఉన్న మద్దతుతో బండి సంజయ్ తన శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. పాదయాత్రలు చేశారు. ఉపఎన్నికలు, గ్రేటర్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారు. కానీ ఇప్పుడు ఆయన నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్తామని గట్టిగా చెప్పలేకపోతున్నారు. పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ వచ్చి చెబుతున్నా ఎవరూ నమ్మడం లేదు. ఎప్పటికప్పుడు నాయకత్వ మార్పు ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. పార్టీలో అంతర్గత సమస్యలకు పూర్తిగా హైకమాండ్‌దే బాధ్యతని బీజేపీ క్యాడర్ అంతృప్తిగా ఉంది. పార్టీలో చేరికలను విస్తృతంగా ప్రోత్సహించారు. అంత వరకూ బాగానే ఉంది కానీ వారి బాధ్యతలేమిటో.. వారికి లభించే ప్రాధాన్యం ఏమిటో ముందుగానే వారికి క్లారిటీ ఇచ్చినట్లయితే.. వారు మరింత ప్రాధాన్యం కోసం ఆశపడేవారు కాదనే వాదన ఉంది. కానీ అలా చెప్పకపోవడం.. ఈటల రాజేందర్ ను పార్టీలోకి తీసుకున్న సమయంలో ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంతో ఆయనలో అసంతృప్తి ప్రారంభమయింది. అంతే కాదు కొత్తగా చేరిన .. ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారు ఎవరూ సంతృప్తిగా లేరు. ఈ ప్రభావం పార్టీపై పడింది. పలుమార్లు ఢిల్లీకి సీనియర్ నేతలను పిలిపించుకున్నా.. సమస్యకు పరిష్కారం చెప్పకుండా పంపేశారు. ఫలితంగా అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలేనన్నట్లుగా ఇక బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోరు ఉందని.. బెంగాల్ తరహాలో పోరాటమేనని బీజేపీ నేతలు అనుకున్నారు. తీరా చూస్తే.. మొత్తం కాల్పుల విరమణ జరిగిపోయినట్లుగా పరిస్థితి మారిపోయింది. ఇది తమ పార్టీని ఇబ్బంది పెట్టడమే కాదు.. ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీకి లాభిస్తుందని అంచనా వేయలేకపోయారో .. మరో విధమైన రాజకీయ వ్యూహం ఉందో కానీ.. మొత్తంగా పార్టీ నేతల్ని.. పార్టీని నమ్ముకున్న క్యాడర్‌ని.. బీఆర్ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా భావిస్తున్న వారికి షాక్ ఇచ్చినట్లయింది. వారిలో మరో ఆలోచన ఏర్పడేలా చేసింది. ఇప్పటికీ బీజేపీ హైకమాండ్ క్లారిటీ ఇవ్వడం లేదు. బండి సంజయ్ ను కేంద్రమంత్రిని చేసి కిషన్ రెడ్డిని మళ్లీ తెలంగాణ చీఫ్ ను చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఏ నిర్ణయం తీసుకున్నా.. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఇంకా ఆలస్యం చేస్తే అసలు రేసులో లేకుండా పోయే ప్రమాదం ఉందన్న ఆందోళన తెలంగాణ బీజేపీ నేతల్లోనే ఏర్పడుతోంది.

## హకీంపేట్ స్పోర్ట్స్ ప్రవేశాలకు భారీ స్పందన..



ఏన్కూర్, జూలై 3 (ప్రజా పాలన న్యూస్):హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కొరకు మండల స్థాయి పోటీలను ఏన్కూర్ బాలుర గురుకుల పాఠశాలలో మండల విద్యా శాఖధికారి, గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధమ ఉపాధ్యాయురాలు శైలు ప్రారంభించారు. సోమవారం 4వ, 5 వ తరగతి చదువుతున్న 52 మంది బాలురు, 36 మంది బాలికలు పాల్గొన్నారు. పిడి చిన్న బాబు ఆధ్వర్యంలో వ్యాయమ ఉపాధ్యాయులు రమేష్, శ్రీ రాములు, శోభన్, లక్ష్మణ్, రామారావు, వీరన్న, ప్రసాద్, ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి రమేష్ పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

### ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు





బోనకల్ ,జూలై 3 ప్రజాపాలన ప్రతినిధి : గురు పౌర్ణమి వేడుకలను సోమవారం మండల కేంద్రంలో సాయిబాబా మందిరం నందు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో సాయిబాబా ఆలయం నందు గురు పౌర్ణమి వేడుకలను మండల వ్యాప్తంగా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళహారతి చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం గురు పౌర్ణమి సందర్భంగా బాబా మందిరం నందు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, టిఆర్ఎస్ బోనకల్ గ్రామ అధ్యక్షులు గుండపునేని సుధాకర్ రావు, బోనకల్ సహకార సంఘం అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆపతి రామారావు ఆధ్వర్యంలో మహా సంపర్క్..



తల్లాడ, జులై 3 (ప్రజా పాలన న్యూస్): భారతీయ జనతా పార్టీ తల్లాడ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన మహాసంపర్క సోమవారం బిల్లుపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగారైతులతో పార్లమెంటరీ కన్వీనరామలింగేశ్వర రావు, సత్తుపల్లి అసెంబ్లీ కన్వీనర్భాస్కర్ని వీరంరాజు, అల్పకాలిక విస్తారక్ కర్రీసత్యనారాయణ రాజు మాట్లాడుతూభారత ప్రధాని నరేంద్ర మోడీ గత సొమ్మిది సంవత్సరాల కాలంలో ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాదె కృష్ణారావు, వేముల వెంకట్రామయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ఎన్జీవోస్ కాలనీలో గురుపౌర్ణమి వేడుకలు



మధిర జులై 3 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక ఎన్జీవో ఎస్ శ్రీ షిర్డి అభయసాయి మందిరము లో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు ఈ సందర్భంగా దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమము జరుగునని ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజు సాయిబాబా ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి భక్తులకు మహా ప్రసాదం అంది అన్నం పరబ్రహ్మ స్వరూపిణి అన్నదానం చేయటం ఆ సాయి కృప అందరికీ ఉండాలని వారు తెలిపారు, ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి సాయి కృపకు పాత్రుడైన కాగలరు బాబా కృపకు పాత్రులు కాగలరని దేవాలయం కమిటీ కోరారు

## గురు పూర్ణిమ సందర్భంగా సాయి బాబా గుడి వద్ద అన్నదానం



మధిర జులై 3 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా షిరిడి ట్రస్ట్ సాయిబాబా దేవాలయం వారి పసూరా గ్రూప్స్ ఆఫ్ ఛైర్మెన్ పబ్బతి రవి వారి కుటుంబం సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం అభిషేకాలు కాకడ హారతి తో ప్రారంభమైన బాబా పూజలు ఈ కార్యక్రమంలో భజన కార్యక్రమం ప్రత్యేక సాయి పూజా కార్యక్రమం అనంతరంఅన్నదానాన్ని ప్రారంభిస్తున్న పసూరా గ్రూప్స్ ఆఫ్ ఛైర్మెన్ పబ్బతి రవి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గురు పౌర్ణమి రోజున మున్సిపాలిటీ పరిధిలో సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు అనంతరం మహా అన్నదానానికి కార్యక్రమం నిర్వహించారు అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు భక్తులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గురు పౌర్ణమి రోజు ఆలయ కమిటీ వారు మహా అన్నదానం ఏర్పాటు చేయటం వల్ల ఆ సాయి దీవెనలు వారికి కొండాలని ఉండాలని వారు తెలిపారు ఆలయ కమిటీ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గురు పౌర్ణమి సందర్భంగా అనేక హారతులతో బాబా గుడిలో పల్లకి సేవ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమం గురు పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో బాబా భక్తులు పాల్గొనడం శుభదినంగా స్వామి కృప అందరికీ ఉండాలని అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దిగ్విజయం చేశారని ప్రతి ఒక్కరు సేవ చేసే భక్తులకు అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు

## సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయండి



సైదాపూర్ ప్రజా పాలన జూలై 3 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్లో లో మంగళవారం రోజున జిల్లా మత్స్యశాఖ అధికారులచే నిర్వహించే మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పెసరు కుమారస్వామి ముదిరాజ్ సోమవారం రోజున వెన్నంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లో జరిగిన సమావేశంలో మాట్లాడారు, ఇట్టి సర్వసభ్య సమావేశానికి కరీంనగర్ జిల్లాలోని అన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు తప్పనిసరిగా హాజరై రాబోయే రోజుల్లో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ జిల్లా ఎన్నికలకు సహకరించాలని, జిల్లా సంఘంలో సభ్యత్వం లేని సహకార సంఘాలు సభ్యత్వం నమోదు చేయించుకోవాలని వారు సూచించారు. ఎన్నికల సమయం అయిపోయిన సహకార సంఘాలు ఎన్నికలు నిర్వహించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పెసరు కొమురయ్య ముదిరాజ్,రేగుల తిరుపతి ముదిరాజ్, రేగుల చిన్న సమ్మయ్య ముదిరాజ్ పెసర రాజు ,పెసర తిరుపతి ముదిరాజ్,రేగుల బిక్షపతి ముదిరాజ్, రేగుల చంద్రమౌళి ముదిరాజ్,రేగుల భూమయ్య ముదిరాజ్, రేగుల హరీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హన్సితాను సన్మానించిన సర్పంచ్ మారెళ్ళ మమత..



తల్లాడ, జులై 3 (ప్రజా పాలన న్యూస్):తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన యల్లంకి వెంకటయ్య మనవరాలు కృష్ణారావు, మమత దంపతుల కుమార్తె హన్సిత బ్యాట్మెంటన్ పోటీల్లో ఉత్తమ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో ఆ విద్యార్థిని గ్రామ సర్పంచ్ మారెళ్ళ మమత, గ్రామ నాయకులు శాలువాలు పూలమాలలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఖమ్మంలో జరిగిన బ్యాట్మెంటన్ పోటీల్లో అండర్ బి 13, అండర్ బి15 డబుల్ లో జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మమత మాట్లాడుతూ ఈ అవార్డు రావడం గ్రామానికే గర్వకారణమన్నారు. ఈ విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడిసి చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, నాయకులు పొన్నం కృష్ణయ్య, చీకటి వెంకటేశ్వర్లు, యలమంచి వెంకటయ్య, రావూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గ గుడిలో అమ్మవారిని దర్శనం చేసుకున్న మల్లు భట్టి విక్రమార్క దంపతులు



మధిర రూరల్ జూలై 3 ప్రజాపాలన ప్రతినిధి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గ దేవాలయాన్ని అమ్మవారి దర్శించుకున్న సీఎల్పీ బట్టి విక్రమార్క దంపతులు శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క 1360 కిలోమీటర్లు పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణ ప్రభుత్వంలో 23 24 వ సంవత్సరం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడం ఖాయమని వారు తెలిపారు గత తొమ్మిది సంవత్సరాల నుంచి అనేక రకాలుగా హామీలతో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా తన కుటుంబ పాలన స్వార్థాల కొరకు తనకు ప్రయోజనం జరిగేలాగా ప్రజలకు న్యాయం జరగట్లేదని ఈ పీపుల్స్ పాదయాత్రతో ప్రజలు అనేక రకాల సమస్యలపై చెప్పినప్పుడు కాంగ్రెస్ పార్టీ వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు తెలిపారు ఇలాంటి కుటుంబ పాలన మనకొద్దని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



మంచిర్యాల టౌన్, జూలై 03, ప్రజాపాలన : వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని మంచిర్యాల వాసవి క్లబ్ వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి తీరంలోని గౌతమేశ్వరాలయం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సన్నిధిలో సోమవారం 11 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గుండా పద్మ నాగరాజు ల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అదేవిధంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ ముందు పోస్ట్ ఆఫీస్ వద్ద కూడా ప్రతి నెల పౌర్ణమి అన్నదానంలో భాగంగా సోమవారం స్వర్గీయ గుండా సంతోష్ కుమార్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు ముక్త శ్రీనివాస్, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పుల్లూరి బాల మోహన్, క్యాబినెట్ సెక్రటరీ అప్పాల శ్రీధర్, రీజియన్ చైర్మన్లు కొంకుముట్టి వెంకటేశ్వర్లు, అక్కెనపల్లి రవీందర్, రీజియన్ సెక్రెటరీ కాసం సతీష్, జోన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన పంచాయతీ కార్మికులు



సైదాపూర్ ప్రజాపాలన జూలై 3: తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగకార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జులై 6నా జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులందరూ జయప్రదం చేయాలని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ మండల కన్వీనర్ కదిరే రమేష్ కరీంనగర్ జిల్లా ఎంపీ డబ్ల్యూ ఉపాధ్యక్షులు జంగ చంద్రయ్య ఎంపీ డబ్ల్యూ మండల అధ్యక్షులు మొలుగురి ప్రేమ్ కుమార్ గ్రామ పంచాయతీ సిబ్బంది రాజు, స్వరూప,సమ్మయ్య ఉన్నారు.

## శ్రీ దివ్య సాయి మందిరంలో వ్యాస గురు పౌర్ణమి వేడుకలు



మధిర రూరల్ జూలై 3 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక శ్రీ దివ్య సాయి మందిరంలో వ్యాస గురు పౌర్ణమ వేడుకలు ఘనంగా నిర్వహించిన దివ్య సాయి ట్రస్ట్ వారి కుటుంబం ఆధ్వర్యంలో ఉదయం నుండి భక్తిశ్రద్ధలతో బాబా ని దర్శించుకొని సాయి భక్తులు అనంతరం ప్రారంభించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు. ఆలయం నిర్వాహకులుశ్రీ పబ్బతి వెంకట రవికుమార్ ఆహ్వానం మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్న రంగా హనుమంతరావు, వేముల తిరుపతి రావు, యార్లగడ్డ నరసింహారావు, దేవిశెట్టి రంగారావు, ఇరుకుల్ల బాల కోటేశ్వరావు, డోకుపర్తి సత్యం బాబు, వేమూరి సునీల్ కుమార్, పల్లపోతు ప్రసాద్, యార్లగడ్డ రమేష్, గంగిశెట్టి శ్రీనివాసరావు, వంగూరి గోపి, కాజా శ్రీనివాసరావు, కన్నెధార చంద్రశేఖర్, రమేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాస గురు పౌర్ణమి సందర్భంగా మధిర ప్రాంత ప్రజలకు సాయి భక్తులకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ దివ్య సాయి ట్రస్ట్ వారు ఇలాంటి మహా అన్నదాన కార్యక్రమానికి సేవ చేయటం శుభదినంగా సాయి కృపకు పాత్రులు అయ్యామని గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం సాయి భక్తులకు మహా అన్నదానం చేయటం వల్ల ఆ సాయి కృప అందరికీ ఉండాలని అన్నం పరబ్రహ్మ స్వరూపిణి అన్నదానం చేయటం వల్ల ఆ సాయినాథ్ కృప అందరికీ ఉండాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో భక్తులు భజన మండలి సేవా కార్యక్రమం వారు పాల్గొన్నారు.

## మధిర ట్రైనీ ఐపీఎస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఐ ఓం.మురళి



మధిర జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ట్రైని ఐపీఎస్ అధికారి అవినాష్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం మధిర సీఐ వడ్డేపల్లి మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సోమ సతీష్ కుమార్ రూరల్ ఎస్సై రఫీ స్టేషన్ సిబ్బంది సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐపిఎస్ అధికారి కేక్ కట్ చేసారు. సర్కిల్ పరిధిలోని అధికారులు,స్టేషన్లోని సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఖాజీపురం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ





మధిర రూరల్ జూలై3 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో సోమవారం నాడుఖాజీపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్టీఎఫ్ నాయకులు కమాల్, గ్రామ ఉపసర్పంచ్ ఆయేషా ఆర్థిక సహాయంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు ,పెన్సిల్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రఫీ ని ఆయేషా కమాల్ దంపతులు, పాఠశాల సిబ్బంది మరియు గ్రామస్తులు ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయులు బిక్షం రెడ్డి గ్రామ సెక్రటరీ ఖాజా అంగన్వాడి టీచర్ పైమున్నిసా, గ్రామ పెద్దలు గౌసుద్దీన్,ఖాజా, తదితరులు పాల్గొన్నారు


# సినిమాస్కోప్

## 'యానిమల్' రిలీజ్ పై క్లారిటీ !




సందీప్ వంగా తన కొత్త సినిమా 'యానిమల్' ని బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ ?తో చేస్తున్న సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ సినిమా ఆగస్టు 11, 2023న విడుదల కావాల్సి ఉంది. ఐతే, ఈ రిలీజ్ డేట్ ను వాయిదా వేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా రిలీజ్ వాయిదాకి కారణం ఏం జరిగిందో వివరించేందుకు సందీప్ రెడ్డి వంగా స్వయంగా ఓ వీడియో పోస్ట్ చేశారు. ఎక్కువ నాణ్యత కోసమే రిలీజ్ డేట్ ను పోస్ట్ చేశామని తెలిపారు. సినిమాలో మొత్తం ఏడు పాటలు ఉంటాయని, వాటిని ఐదు భాషల్లో పాడేలా చేయడానికి మరింత సమయం పడుతుందని సందీప్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 1, 2023న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి మంచి తేదీగా నిర్ణయించినట్లు సందీప్ వంగా చెప్పుకొచ్చాడు. కాగా మనుషుల్లో మారుతున్న స్వభావాల చుట్టూ సాగే కథ ఇది. మనిషి జంతువులా మారితే ? ఈ కోణంలో ఈ 'యానిమల్' సాగనుంది. ఈ సినిమాకు సిద్ధార్థ్ గరిమ మాటలు సమకూర్చగా హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందించారు. టీ సిరీస్ భూషణ్ కుమార్, భద్రకాళీ పిక్చర్స్, సినీ స్టూడియోస్ వన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.


## గురూజీ ఇస్మార్ట్ మూవీ ఉన్నట్లా? లేనట్లా?



టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ త్రివిక్రమ్ దర్శకత్వంలో ప్రస్తుతం గుంటూరు కారం సినిమా రూపొందుతోంది. ఆ సినిమా చిత్రీకరణ పూర్తి అవ్వకుండానే ఇటీవలే అల్లు అర్జున్ తో ఒక సినిమాను ప్రకటించిన విషయం తెల్సిందే. అల్లు అర్జున్ తో నాల్గవ సినిమాకు రెడీ అయిన త్రివిక్రమ్ చాలా ఏళ్ల క్రితం కమిట్ అయిన సినిమాను మాత్రం ఇప్పటి వరకు మొదలు పెట్టడం లేదు అంటూ కొందరు విమర్శిస్తున్నారు. త్రివిక్రమ్ కెరీర్ ఆరంభంలో స్రవంతి రవికిషోర్ బ్యానర్ లో మంచి ఆఫర్లు వచ్చాయి. ఆ ఆఫర్ల వల్లే త్రివిక్రమ్ తన ప్రతిభను చూపించుకున్న విషయం తెల్సిందే. అందుకే ఆ బ్యానర్ రుణం తీర్చుకోవాలి అనే ఉద్దేశ్యంతో ఆ ఫ్యామిలీకి చెందిన హీరో రామ్ తో ఒక సినిమాను చేసేందుకు త్రివిక్రమ్ ఆ మధ్య ప్లాన్ చేస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా అదుగో ఇదుగో అంటూ వాయిదా పడుతూ వస్తోంది. గుంటూరు కారం సినిమాకు ముందు చర్చ జరిగింది.. గుంటూరు కారం సినిమా తర్వాత రామ్ తో త్రివిక్రమ్ సినిమా ఉంటుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు రామ్ తో కాకుండా అల్లు అర్జున్ తో సినిమా మొదలు పెట్టడంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రామ్ సినిమా ఉంటుందా లేదా అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

తరామ్ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్నాడు. ఆ వెంటనే పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఒక సినిమా ను చేయబోతున్నాడు. ఆ రెండు సినిమాల తర్వాత అయినా త్రివిక్రమ్ దర్శకత్వంలో రామ్ నటించే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి. త్రివిక్రమ్ రూపొందిస్తున్న సినిమాల ఖరీదు వందల కోట్లు... బడా చిత్రాలను రూపొందిస్తున్న త్రివిక్రమ్ రామ్ వంటి చిన్న స్టార్ తో సినిమా కు ఆసక్తి చూపించడం లేదా అంటూ కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## 'స్కంద' గా రాబోతున్న రామ్ పోతినేని




యాక్షన్ డైరెక్టర్ బోయపాటి శ్రీను ప్రస్తుతం హీరో రామ్ తో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈరోజు ఈ సినిమా టైటిల్ని ప్రకటించారు మేకర్స్. 'స్కంద' అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఈ సినిమాకి ఫిక్స్ చేశారు. అలాగే ఈ టైటిల్ని రివీల్ చేస్తూ మేకర్స్ ఓ ఇంట్రస్టింగ్ యాక్షన్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ యాక్షన్ గ్లింప్స్లో రామ్ ఫుల్ యాక్షన్ మోడ్ లో కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు చిత్రబృందం ధృవీకరించింది. సెప్టెంబరు 15, 2023న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాలోలో రామ్ పోతినేని సరసన శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే సాయి మంజ్రేకర్ కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. మొత్తానికి బోయపాటి చేస్తున్న ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. అన్నిటికీ మించి హీరో ఎవరైనా తన సినిమాల్లో మాస్ ఎలిమెంట్స్ ను పక్కాగా ప్లాన్ చేసి హిట్ కొట్టడంలో బోయపాటికి మంచి అనుభవం ఉంది. ఈ మూవీని పాన్ ఇండియన్ రేంజ్ లో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు.

## కాజల్ బ్యూటీ సీక్రెట్ పప్పు అన్నమా?



చందమామ కాజల్ అగర్వాల్ బ్యూటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు పెళ్లి చేసుకుని ఓ బిడ్డకు తల్లైనా! అదే బ్యూటీతో ఆకట్టుకుంటుంది. నవ నాయికలా అవకాశాలు అందుకోవడంలోనూ దూకుడు చూపిస్తుంది. యూత్ లో క్రేజీ భామగా దూసుకుపోతుంది. మరి ఈ బ్యూటీ వెనుక సీక్రెట్ ఏంటి? అందరా జిమ్ కి వెళ్లడం..24 గంటలు నీళ్లు తాగడం! మితంగా తినడం వంటివి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. కాజల్ బ్యూటీ లెక్క ఇక్కడ వేరే ఉంది. ఉదయాన్ని చిన్న పాటి ఎక్సరసైజులు ముగించిన తర్వాత ఉడకబెట్టిన గుడ్డు తింటుందిట. దాంతో పాటు ఒకొ జొన్న రొట్టె కర్రీతో పాటు తీసుకుంటుందిట. ఇక మధ్నాహ్నం లంచ్ లో...రాత్రి డిన్నర్ లో కచ్చితంగా పప్పు ఉండాల్సిందేనట. రెండు పూటలు రైస్ తప్పకుండా పప్పుతోనే తింటుందిట. ఇంట్లో ఉన్నా..సినిమా సెట్స్ లో ఉన్నా? ఆ రెండు పూటలు పప్పు ఉండాలని ముందే చెబుతుందిట. పప్పు చాలా ఇష్టంగా తింటుందిట. సాయత్రం పూట శాండ్ విచ్ తింటుందిట. కానీ నాన్ వెజ్ మాత్రం ముట్టుకోదటు. దాని వాసన కూడా పడదంట. పూర్తిగా శాఖాహారిని అంటోంది. అప్పుడప్పుడు అన్నంలోకి రాజ్మా చావల్ తీసుకుంటుందిట. పన్నీరు కూడా ఎంతో ఇష్టంగా తింటుందిట. దీని వల్ల ఫ్యాట్ ఫామ్ అవుతుందని తెలిసినా తింటుందిట. అలాగే ప్రతీ రోజు ప్రోటీన్ షేక్స్..కొబ్బరి నీళ్లు తాగుతుంటా. చీట్ మీల్ డే రోజు మాత్రం అమ్మ చేసే పరోటాలు కనీసం పదైనా లాంగించాల్సిందే అంటోంది. అలాగే అమ్మడు మంచి మ్యూజిక్ ప్రియురాలు అట. ఇళయరాజా పాటలు ఎక్కువగా వింటుందిట. మణిరత్నం సినిమాలు అప్పుడప్పుడు చూస్తుందిట. పుస్తకాలు కూడా బాగానే చదువుతుందిట. రీడింగ్ హ్యాబిట్ చిన్నప్పటి నుంచి ఉందిట. ఆయన్ రౌండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ పుస్తకం ఎంతో ఇష్టంగా చదువుతుందిట. ఇక అమ్మడు నటిగా ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో మూడు సినిమాలు చేస్తోంది. అలాగే ఇండియన్ -2లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే.

## రామ్ చరణ్ తో దీపికా సీక్రెట్ ఇదే..!





ఆర్ఆర్ఆర్ తో రామ్ చరణ్ గ్లోబల్ స్టార్ గా మారిపోయారు. దీని తర్వాత ఆయన అన్నీ పాన్ ఇండియా మూవీలను మాత్రమే ఎంచుకుంటున్నారు. మొన్నటి వరకు గేమ్ ఛేంజర్ కోసం ఆయన కష్టపడ్డారు. ఇటీవల కూతురు పుట్టడంతో షూటింగ్స్ కి బ్రేక్ ఇచ్చి భార్య తన ముద్దుల యువరాణితో సరదాగా గడుపుతున్నారు. క్రమంలో తాజాగా ఆయనకు సంబంధించిన ఓ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఆ ఫోటోలో ఆయనతో పాటు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే కూడా ఉండటం విశేషం. వీరి సీక్రెట్ మీటింగ్ వెనక ఉన్న అసలు విషయం కూడా బయటకు వచ్చింది. ఇంతకీ మ్యాటరేంటంటే దీపికా ఆమె భర్త రణవీర్ తో కలిసి చరణ్ ఓ ప్రాజెక్టు కోసం పనిచేశాడట. ఇందుకు సంబంధిదంచి 'షో మీ ద సీక్రెట్' పేరుతో కూడిన వీడియో ప్రస్తుతం ఆన్లైన్లో వైరల్గా మారింది. ఈ వీడియోలో కంటెంట్ చాలా కొత్తగా ఆకట్టుకునేలా ఉంది. అయితే అది మూవీ మాత్రం కాదని తెలుస్తోంది. కానీ వీడియో మాత్రం విపరీతంగా ఆకట్టుకుంటోంది. వీడియోలో ఉన్న కంటెంట్ విషయానికి వస్తే దీపికా పదుకొణే తన భర్త కోసం వెతుకుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే పోలీసు అధికారి రణవీర్ కి ఫిర్యాదు చేస్తుంది. ఇక రామ్ చరణ్ సీక్రెట్ ఏజెంట్ గా కనిపిస్తుండగా త్రిష కూడా కీలక పాత్రలో పోషిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు దీపికా భర్త ఎవరు..? అతను ఎక్కడికి వెళ్లాడు? రామ్ చరణ్ త్రిషకి సంబంధం ఏంటి? ఈ విషయాలన్నీ తెలియాలంటే జులై 5వ తేదీ వరకు ఆగాల్సిందే. ఆ రోజున ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియనున్నాయి. ఈ వీడియో ఒక బ్రాండ్ కోసం చేసిన యాడ్ అని తెలుస్తోంది. అయితే ఇది యాడ్ అయినప్పటికీ నెటిజన్లను మాత్రం విపరీతంగా ఆకట్టుకుంటోంది. రామ్ చరణ్ తో దీపిక ను కలిసి చూడటం ఆయన ఫ్యాన్స్ ని బాగా ఆకట్టుకుంటోంది. వీరిద్దరూ కలిసి సినిమా చేస్తే బాగుండు అని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## భోళా శంకర్ షూటింగ్ ముగించాడు

మెగాస్టార్ చిరంజీవి భోళా శంకర్ గా అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. తమన్నా కథానాయికగా మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ మెగా చిత్రం 2023 ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐతే, ఈ రోజు, చిత్ర దర్శకుడు మెహర్ రమేష్ సోషల్ మీడియా వేదికగా భోళా శంకర్ షూటింగ్ మొత్తం పూర్తయిందని ప్రకటించారు. సినిమా కోసం కష్టపడిన నటీనటులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయన ఈ పోస్ట్ చేశారు. ప్రస్తుతం భోళా శంకర్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, త్వరలోనే మ్యూజికల్ అప్ డేట్ లను విడుదల చేస్తామని మెహర్ రమేష్ తన పోస్ట్ లో పేర్కొన్నాడు. ఇక ఈ చిత్రంలో కీర్తి సురేష్, సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖావాణి తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. మరీ మెగాస్టార్ ను మెహర్ రమేష్ ఎంత కొత్తగా చూపిస్తాడో చూడాలి.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989